

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



పదవి వచ్చిందన్న
## అహంకారం వద్దు
అందరినీ కలుపుకుని ముందుకుసాగాలి: లోకేష్

- వివరాలు 5 లో.

# పసుపు జెండా రెపరెపలాడాలి







- 2014 మించి ఓట్లు రావాలి
- చేసిన అభివృద్ధి..తెచ్చిన మార్పు.. పడిన కష్టం ప్రజలకు వివరిద్దాం
- పనిచేసిన వారికే పదవులు.. సీనియారిటీ, సిన్సియారిటీతో కూర్పు
- సమర్థుడు కాబట్టే లోకేష్‌కు పదవి
- క్యాడర్‌ను ముందుండి నడిపించారు
- 2024కు ముందు ప్రతి ఘటన.. చేసిన ప్రతి పోరాటం గుర్తుంది
- తలవంచని సైన్యం టీడీపీ సొంతం
- గొడ్డలి పార్టీకి మానసిక అనారోగ్యం
- గూగులే కాదు..స్వాతంత్ర్యం తెచ్చామని కూడా ప్రచారం చేసుకుంటుంది
- నేరస్తులతో పోరాడుతున్నాం.. ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలి
- నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కార్యవర్గంతో ప్రమాణస్వీకారం

తలవంచని మీసం మేలేసే క్యాడర్ టీడీపీ సొంతం. తెలుగు జాతి ఉన్నంతవరకు పార్టీ ఉంటుంది. కార్యకర్తే అధినేత అనేది నినాదం కాదు.. విధానంగా మార్చుకున్నాం. రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, ఇస్తున్న సంక్షేమం.. తెచ్చిన మార్పు.. పడిన కష్టాన్ని ప్రజలకు చెబుదాం. **2014** మించి ఈసారి ఓట్లు రావాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లోకేష్ చాలా కీలక పాత్ర పోషించారు. సమర్థతను గుర్తించే వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించాం. నాకు ప్రతి ఘట న.. ప్రతిఒక్కరి పోరాటం గుర్తుంది. కార్యకర్తలు పడ్డ కష్టాలు గుర్తున్నాయని చెప్పారు. గొడ్డలి పార్టీకి సీసీడీ వ్యాధి సోకింది. నేరస్తులతో పోరాడుతున్నాం. మనం రిలాక్స్ అయితే..అబద్ధాలు ప్రపంచమంతా తిరుగుతాయి. అందుకే ప్రజలను నిత్యం అప్ర మత్తం చేయాలని పిలుపునిచ్చారు.

2





## డిసెంబర్ నాటికి అన్ని సేవలూ ఆన్‌లైన్

- శరవేగంగా డ్రోన్ సిటీ మొదటిదశ పనులు
- శాటిలైట్ సమాచారం వినియోగానికి కార్యాచరణ
- ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు నిర్దేశం

3

# మీ త్యాగాలే స్ఫూర్తి..

### టీడీపీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సభలో నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్



నాయకులు, కార్యకర్తల త్యాగాలతోనే ఈ స్థాయికి వచ్చా..పార్టీ కోసం ప్రాణాలొడ్డిన వారే నాకు స్ఫూర్తి. **44** ఏళ్ల చరిత్ర ఉన్న పార్టీకి నన్ను నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, పార్టీ నాయకులు, క్యాడర్‌కు ధన్యవాదాలు.. పదవి మరింత బాధ్యత పెంచిందని నారా లోకేష్ పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్ ప్రమాణస్వీకారం చేశారు. దేశ రాజకీయాల్లో మన పార్టీ ఒక ప్రభంజనం. మనకి గల్లీ పాలిటిక్స్ తెలుసు..ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించిన పార్టీ తెలుగుదేశం అని ఉద్ఘాటించారు. ఒక్కడినే చేయగలనన్న అహంకారం లేదు..కలిసికట్టుగా ముందు కువెళదామని పిలుపునిచ్చారు. మనకి సినిమా చూపిస్తా అంటున్న రప్పా రప్పా బ్యాచ్‌కి ఒకటే చెబుతున్నా. మీ సినిమాకు ఎండ్ కార్డ్ వేసేది మా పసుపు సైన్యమేనని హితవుపలికారు.

4

## నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు విందు

### మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీలకు ఆహ్వానం

ముఖ్యమంత్రి చంద్రబాబు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-**2025** అవార్డును అందుకున్న విషయం తెలిసిందే. టీమ్ ఏపీ స్పిరిట్‌తో పనిచేయడం వల్లే ఈ అవార్డు వచ్చిందని సీఎం చెప్పారు. ఈ నేపథ్యంలో ధన్యవాదాలు తెలిపేందుకు క్యాబినెట్ మంత్రులు, ప్రభుత్వంలోని పలు శాఖల కార్యదర్శులు, వివిధ విభాగాల అధిపతుల (హెచ్ఓడీ)కు గురువారం విందు ఇవ్వనున్నారు.

3

# పసుపు జెండా రెపరెపలాడాలి

- 2014 మించి ఓట్లు రావాలి
- చేసిన అభివృద్ధి.. తెచ్చిన మార్పు.. పడిన కష్టం ప్రజలకు వివరిద్దాం
- పనిచేసిన వారికే పదవులు.. సీనియారిటీ, సిన్సియారిటీతో కూర్పు
- సమర్థుడు కాబట్టే లోకేష్‌కు పదవి
- క్యాడర్‌ను ముందుండి నడిపించారు
- 2024కు ముందు ప్రతి ఘటన.. చేసిన ప్రతి పోరాటం గుర్తుంది
- తలవంచని సైన్యం టీడీపీ సొంతం
- గొడ్డలి పార్టీకి మానసిక అనారోగ్యం
- గూగులే కాదు..స్వాతంత్ర్యం తెచ్చామని కూడా ప్రచారం చేసుకుంటుంది
- నేరస్తులతో పోరాడుతున్నాం.. ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలి
- నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కార్యవర్గంతో ప్రమాణస్వీకారం



అమరావతి(చైతన్యరథం): ప్రతీ పోలింగ్ బూత్ పరిధిలో 2014 మించి కూటమి పార్టీలకు ఓట్లు రావాలని టీడీపీ కొత్త కార్యవర్గానికి, నేతలకు, కార్యకర్తలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సంద ర్భంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు మాట్లాడుతూ మరో మూడేళ్లలో మళ్లీ ఎన్నికలు వస్తాయని ప్రతిఒక్కరూ గుర్తుపెట్టుకో వాలి. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేసేందుకే కూటమికి ప్రజలు ఓట్లేశారు. వచ్చే ఎన్నికల్లో 2024లో వచ్చిన ఓట్లకంటే ఎక్కువ ఓట్లు రావాలి..అప్పుడే బాగా పని చేసినట్లు లెక్క. ఓటు బ్యాంక్ నిత్యం పెరుగుతూనే ఉండాలి. పార్టీ ప్రతిష్ట పెరిగేలా ప్రతిఒక్కరూ పని చేయాలి. పార్టీ శాశ్వతంగా ఉండాలి.. తెలుగుదేశం బాగుంటే.. రాష్ట్రం బాగుంటుంది. రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, ఇస్తున్న సంక్షేమం.. తెచ్చిన మార్పు.. పడిన కష్టాన్ని ప్రజలకు చెబుదాం. ప్రతిదీ నిష్టతో.. మనస్సుతో.. భవిష్యత్తు కోసం పనిచేయాలి. స్థానిక సంస్థల ఎన్నికలు వన్‌సైడ్‌గా ఉంటాయని చెప్పారు.



## తలవంచని.. మీసం మేలేసే క్యాడర్ టీడీపీ సొంతం

ఎన్నో వడపోతలు, లెక్కలు, ఈక్వేషన్లతో కమిటీలను ఏర్పాటు చేశాం. సీనియర్లను గౌరవిస్తూ.. కొత్తవారికి అవకాశాలు ఇస్తూ.. కష్టపడిన వారికి చోటిస్తూ కమిటీలను ఏర్పాటు చేశాం. తెలుగు దేశం కార్యకర్తలు ఎప్పుడూ మీసం మేలేస్తారు.. ఎవ్వరికీ తలవంచరు. తెలుగుజాతి ఉన్నంతవరకు తెలుగుదేశం పార్టీ ఉంటుంది. కార్యకర్తే అధినేత అనేది నినాదంగా కాదు.. విధానంగా మార్చుకున్నాం. మండల పార్టీ అధ్యక్షురాలికి.. క్లస్టర్ ఇన్‌చార్జికి పొలిట్ బ్యూరోలో స్థానం కల్పించాం. మహిళలకు ఎక్కువగా అవకాశాలి చ్చాం. మహిళా బిల్లుకు పూర్తిగా మద్దతిచ్చాం. చదువుకున్న వారికి మంత్రి పదవులిచ్చి ప్రోత్సహించాం. రామ్మోహన్నాయుడు, శబరి, రాజేష్ వంటి వారిని జాతీయ ఉపాధ్యక్షులుగా చేసుకున్నాం. సినీయారిటీ, సిన్సియారిటీ, సోషల్ రీ-ఇంజనీరింగ్ వంటి కసరత్తు చేసి కమిటీ కూర్పు చేపట్టామని వివరించారు.

## సమర్థతను గుర్తించే లోకేష్‌కు బాధ్యతలు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లోకేష్ చాలా కీలక పాత్ర పోషించారు. క్యాడర్‌ను నిరంతరం మోటివేట్ చేశారు. అధికారంలోకి వచ్చాక పార్టీని గేరప్‌చేశారు. ట్రైనింగ్ క్లాసులు మొదలుకుని కార్యకర్తల సంక్షేమ బాధ్యతలను లోకేష్ సమర్థవంతంగా నిర్వహించారు. 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తామనే హామీని నెరవేర్చేందుకు లోకేష్ కృషి చేస్తున్నారు. ప్రపంచ ప్రసిద్ధ కంపెనీలు ఏపీకి వచ్చాయంటే కారణం లోకేషే. సమర్థతను గుర్తించే వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించాం. వర్కింగ్ ప్రెసిడెంట్ అనేది పదవి కాదు.. అత్యున్నత బాధ్యత. అప్పగించిన పదవిని బాధ్యతతో నిర్వహించాలి. 2024కు ముందున్న పరిస్థితులన్నీ అందరికీ తెలుసు. నాకు ప్రతి ఘటన.. ప్రతిఒక్కరి పోరాటం గుర్తుంది. కార్యకర్తలు పడ్డ కష్టాలు గుర్తున్నాయని చెప్పారు.

## ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతున్నాం

“వెంటిలేటర్ మీదున్న ఆర్థిక వ్యవస్థను కేంద్ర సాయంతో గట్టె క్కిస్తున్నాం. ఒక్కొక్కడుగు వేస్తున్నాం... వ్యవస్థలను గాడిలో పెడు తున్నాం. నిలిచిన కేంద్ర పథకాలను పునరుద్ధరించాం. అప్పులను రీ-షెడ్యూల్ చేస్తున్నాం. సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చాం. సంక్షే మం అందిస్తున్నాం. సుపరిపాలనతో వాట్సాప్ సేవలు అందిస్తున్నాం. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. ఇరిగేషన్ ప్రాజెక్టులు పరుగులు పెట్టిస్తున్నాం. పోలవరం, అమరావతి పనులు చేపడుతున్నాం. స్టీల్ ప్లాంట్‌ను రివైవ్ చేయగలుగుతున్నాం. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని కాపాడుకున్నాం. రాష్ట్రానికి గత పాలనలో పోయిన బ్రాండ్.. నమ్మకాన్ని తిరిగి తీసుకురాగలిగాం. స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్నాం. విధ్వంసమైన విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించాం. ట్రూ అప్ ఛార్జీల భారం భరిస్తున్నాం. ట్రూ డౌన్ ఛార్జీల ద్వారా ప్రజలపై విద్యుత్ భారం తగ్గిస్తున్నాం. కరెంట్ ఛార్జీల పెంచకుండా పాలన చేపడుతున్నాం. విద్యుత్ కొనుగోళ్ల ధరలు తగ్గించేలా చర్యలు చేపడుతున్నాం. గతేడాది 30 పైసలు తగ్గించాం.. మరో 30 పైసలు తగ్గించేలా ప్రణాళికలు రూపొందించాం. కరెంట్ ఛార్జీలు తగ్గించే ఆలోచనతో పనిచేస్తున్నాం. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, హైవేలు పూర్తి చేసుకుం టున్నాం. విశాఖను టెక్ నగరంగా మారుస్తాం. రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం. నిధుల లభ్యత తక్కువగా ఉన్నా.. సమర్ధ పాలనతో పనులన్నీ చేస్తున్నాం. తెలంగాణలో రాష్ట్రా ఆదాయంలో జీతాలకు 45 శాతం ఖర్చు పెడుతోంటే.. మన రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో 99 శాతం జీతాలకు ఖర్చు పెడుతున్నాం. అభివృద్ధి-సంక్షేమం ఆగకూడదని నిరంతరంగా కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఎంతో కష్టపడి పనిచేస్తున్నాం. ఠంచనుగా ఒకటో తేదీనే పెన్షన్లు ఇస్తున్నాం. దేశంలోని బెస్ట్ పాలసీలను అమలు చేస్తున్నామని వివరించారు.

## గొడ్డలి పార్టీకి సీసీడీ సోకింది

మనం చేసిన మంచినే కాదు.. ప్రత్యర్థుల కుట్రలను ప్రజలకు వివరించాలి. గొడ్డలి పార్టీ చేస్తున్న చెడును అనునిత్యం ప్రజలకు చెప్పాలి. అధికారంలో ఉండగా నాశనం చేసింది చాలక.. ఇప్పుడూ కుట్రలు చేస్తున్నారు. కిల్లింగ్ మనస్తత్వంతో ఉన్న పార్టీకి సంక్షేమం పట్టదు.. అభివృద్ధి గిట్టదు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు తీసుకురావాలంటే వాటిని అడ్డుకునే ప్రయత్నం ప్రత్యర్థులు చేస్తున్నారు. ఇంత అడ్డుకుంటున్నా పెట్టుబడులు పెద్దఎత్తున వస్తున్నాయి. ప్రత్యర్థి పార్టీ కుట్రలకు కాలం చెల్లింది. సీసీడీ అనేది ఓ వ్యాధి... గొడ్డలి పార్టీకి ఆ వ్యాధి సోకింది. క్రెడిట్ చోరీ డిజార్డర్‌తో గొడ్డలి పార్టీ మానసిక అనారోగ్యానికి గురైంది. వీళ్లని ఇలాగే వదిలేస్తే దేశానికి స్వాతంత్ర్యం కూడా తామే తెచ్చానని చెబుతారు. ఆపరేషన్ సింధూర్‌కు అవసరమైన డ్రోన్లను కూడా తామే పంపామని చెప్పేలా ఉంది. మనకే అనుమానం వచ్చేలా ఫేక్ ప్రచారం చేయడంలో గొడ్డలి పార్టీ ముందుంటుంది. సొంత బాబాయి వివేకాను హత్య చేసి నెపం మనపై నెట్టారు. వాళ్ల కార్యకర్తను కారుతో తొక్కించి.. ఆ పాపాన్ని మనపైకే నెట్టారు. కబ్జా చేసిన ఆస్తుల కోసం కడపలో అనుచరుడినే చంపేశారు.. వాస్తవాలు బయటపడితే ఎదురు దాడి చేస్తున్నారు.నా జీవితంలో రాజకీయ నేతలతో పోరాడాను కానీ.. నేరస్తులతో పోరాడలేదు.తొలిసారిగా నేరస్తులతో పోరాడుతున్నాం. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. మనది అభివృద్ధి..వాళ్లది అవినీతి... మనది వికాసం... వాళ్లది విధ్వంసం. మనం రిలాక్స్ అయితే.. అబద్ధాలు ప్రపంచమంతా తిరుగుతాయి. అందుకే ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలని దిశానిర్దేశం చేశారు.

## ఫ్లెక్సీల కోసం.. కుర్చీల కోసం గొడవలొద్దు

తెలుగుదేశం పార్టీ అంటేనే క్రమశిక్షణ. కార్యకర్తల నుంచి అధ్యక్షుడి వరకు క్రమశిక్షణతో పనిచేయడం పార్టీ మూల సిద్ధాంతం. ప్రజలతో సౌమ్యంగా ఉండాలి.. అందుబాటులో ఉండాలి. ప్రజలకు-ప్రభుత్వానికి వారధిగా ఉండాలి. నేతలు, కార్యకర్తలు తప్పు చేస్తే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది. ఈ మధ్య కొన్ని సంఘటనలు జరిగాయి.. నేను చాలా మనస్థాపానికి గురయ్యాను. మనం సుపరిపాలన యజ్ఞం చేస్తున్నాం.. మన వాళ్లు కూడా సరిగా వ్యవహరించకుంటే బాధ కలుగుతుంది. నేను, పవన్‌కళ్యాణ్ చక్కగా ఉంటున్నాం. మంచి రిలేషన్ కొనసాగిస్తున్నాం. ఇదే క్షేత్రస్థాయిలో ఉన్న కార్యకర్తలు కూడా వ్యవహరించాలి. బీజేపీని కలుపుకుని వెళ్లాలి.. రాష్ట్రానికి-కేంద్రానికి గ్యాప్ లేదు.. రాకూడదు. చిన్నపాటి కలహాలు కూడా రాకూడదు... ఫ్లెక్సీల దగ్గర, ఫొటోల దగ్గర, కుర్చీల దగ్గర గొడవలొద్దు. మంత్రులు, ఎమ్మెల్యేలు సహా గ్రామస్థాయి కార్యకర్తలు దీన్ని గుర్తు పెట్టుకోవాలని హితవుపలికారు.

## ప్రజలు గమనిస్తున్నారనే స్పృహతో ఉండాలి

నేతలు, కార్యకర్తలు అతిగా ప్రవరిస్తే ప్రజలు హర్షించరు. గతంలో పాలకుల గర్వాన్ని, అహంకారాన్ని చూశాం.. ప్రజలు ఆ పార్టీకి బుద్ది చెప్పారు. బూతులు, వివాదాలు, దాడులు, గొడవలు, సెటిల్మెంట్లకు దూరంగా ఉందాం. మనకు ప్రజలు సహకరించారు.. నమ్మకం పెట్టుకున్నారు.. ప్రస్తుతం ప్రజలు మనల్ని గమనిస్తున్నారు. ఎవరైనా అధికారం ఉందని ఈగోలకు పోతే.. భవిష్యత్తులో నష్టం జరుగుతుంది. నేతలు తమ కింద వాళ్లకు కూడా సత్ప్రవర్తనను నేర్పించాలి. కీలక పదవుల్లో ఉన్న వారు తప్పు చేస్తే మీడియాలో హెడ్డింగులు వస్తాయి. అనునిత్యం పని చేయడంతోపాటు..పార్టీ క్రమశిక్షణను కూడా కాపాడాలి. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా ఉండొద్దు.. మళ్లీ మళ్లీ ఎన్నిక కావాలి. అందరూ మనస్పర్థలు లేకుండా పనిచేయాలి. తాను లేకుండా ఎంపీ తమ ప్రాంతానికి రాకూడదని ఎమ్మెల్యేలు అనడం కరెక్ట్ కాదు. టిక్కెట్ ఇచ్చిన వారి వెంటే క్యాడర్ ఉంటారు. ఇదే టీడీపీ స్పెషాలిటీ. లీడర్లు ఈ విషయాన్ని నిత్యం గుర్తుంచుకోవాలి. పర్మిషన్లతో పదవులు ఇవ్వరు.. పనిచేసిన వారికే పదవులిస్తాం. అన్నీ తెలుసని తప్పులు చేయొద్దు.. నేర్చుకుందాం.. రాష్ట్రానికి ఉపయోగపడదామని పిలుపునిచ్చారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

చైతన్యరథం

# డిసెంబర్ నాటికి అన్ని సేవలూ ఆన్‌లైన్

- శరవేగంగా డ్రోన్ సిటీ మొదటి దశ పనులు
- శాటిలైట్ సమాచారం వినియోగానికి కార్యాచరణ
- ఆర్టీజీ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం



అమరావతి(చైతన్యరథం): ప్రభుత్వ శాఖలు అందిస్తున్న అన్ని సేవలు ఈ ఏడాది డిసెంబరు నాటికల్లా ఆన్‌లైన్‌లో అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వాట్సప్ గవర్నెన్స్ మనమిత్ర పరిధిలోకి అన్ని సేవలు తీసుకువస్తే ప్రజల కు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని ఉండదని చెప్పారు. ఆర్టీజీఎస్‌పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో క్యాంపు కార్యాల యంలో బుధవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 1,035 సేవలు అందిస్తున్నామని తెలిపారు. వాట్సప్ గవర్నెన్స్ సేవలు ప్రారం భించిన దగ్గర నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 54 లక్షల మంది 1.78 కోట్ల సేవలు పొందారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. వాట్సప్ గవర్నెన్స్ సేవల వినియోగం పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని సీఎంకు తెలిపారు. ఇప్పటివరకూ 24 లక్షల మందికి పైగా వాట్సప్ గవర్నెన్స్ సేవలు ఎలా పొందాలో అవగాహన కల్పించామని చెప్పారు. కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీ ఫేజ్ 1 అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని.. ఇప్పటికే ప్లాంట్లు నెలకొల్పేందుకు ముందుకొచ్చిన 8 కంపెనీలకు భూముల కేటాయింపు పూర్త యిందని, మే రెండో వారంలో ఇవన్నీ గ్రౌండ్ అవుతాయని అధి కారులు ముఖ్యమంత్రికి వివరించారు. డ్రోన్ సిటీ మాస్టర్ ప్లాన్ ఖరారు అయిందని అధికారులు ఇచ్చిన వివరణపై స్పందిస్తూ ఈ ఏడాది జూలై నాటికి మొదటి దశ పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

### సీసీ కెమేరాలతో నేర నియంత్రణ చర్యలు

దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనంతగా ఆంధ్రప్రదేశ్‌లో సీసీ టీవీ కెమేరాల ఏర్పాటు, వాటి వినియోగం, పర్యవేక్షణ జరుగుతోందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీనివల్ల రాష్ట్రంలో నేరాల నియంత్రణ, నేరస్తులను గుర్తించడంతోపాటు... మిస్సింగ్ కేసుల ట్రేసింగ్, వాహనాల దొంగతనాల వంటి కేసులు వేగంగా కొలిక్కివస్తున్నాయని చెప్పారు. అయితే సీసీ కెమేరాలు లేని ప్రాంతాల్లో ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల డేటాను కూడా ఇంటిగ్రేట్ చేయాలని, ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. సీసీ కెమేరాలతోపాటు శాటిలైట్ డేటాను వినియోగించుకునేలా కార్యాచరణ చేపట్టాలని అధికారుకు సీఎం నిర్దేశించారు. శాటిలైట్ సమాచారాన్ని ఆర్టీజీఎస్ కు అనుసంధానించి వేగంగా చర్యలు చేపట్టేలా చూడాలన్నారు.

ఇటీవల తిరుమల-తిరుపతి సమీపంలో శేషాచల అటవీ ప్రాంతంలో మంటలు వ్యాపించిన ఘటనపై వేగంగా స్పందించే అవకాశం ఉండేదన్నారు. డీజిల్, పెట్రోలు సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తక్షణ చర్యలతో మళ్లీ సాధారణ స్థితికి నెలకొందని...అయితే సమస్య ఉత్పన్నం కాకముందే రియల్ టైమ్‌లో స్పందించేలా చర్యలు ఉండాలని సీఎం సూచించారు.





## సీఎస్ కుమార్తె నిశ్చితార్థానికి చంద్రబాబు

*విజయవాడలో బుధవారం జరిగిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ కుమార్తె త్రిలోక్య పావని, ప్రభాస్‌ల నిశ్చితార్థం కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. కాబోయే వధూవరులను ఆశీర్వదించారు.*

### నేడు మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీలకు

## ముఖ్యమంత్రి చంద్రబాబు విందు



అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డును అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో క్యాబినెట్ మంత్రులు, ప్రభుత్వంలోని పలు శాఖల కార్యదర్శులు, వివిధ విభాగాల అధిపతుల (హెచ్‌ఓ డీ)కు సీఎం చంద్రబాబు విందు ఇవ్వనున్నారు. గురువారం రాత్రి సీఆర్డీఏ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. తనకు వచ్చిన ఈ అవార్డు రాష్ట్రానికి, ప్రభుత్వానికి వచ్చిన గుర్తింపు అని సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. టీమ్ ఏపీ స్పిరిట్‌తో పనిచేయడం వల్లే అందరి సహకారం, భాగస్వామ్యంతో ఈ అవా ర్డు వచ్చిందని వివరించారు. ఈ నేపథ్యంలో మంత్రులు, అధికా రులను మోటివేట్ చేసేందుకు, వారి సహకారానికి ధన్యవాదాలు తెలిపేందుకు వారిని ఈ డిన్నర్‌కు ఆహ్వానించారు. డిన్నర్ విత్ విన్నర్స్ పేరుతో మంత్రులు, సెక్రటరీలు, హెచ్‌వోడీలకు ఇప్పటికే సీఎం చంద్రబాబు పేరుతో ఆహ్వానాలు వెళ్లాయి. రాజధాని అమ రావతిలోని సీఆర్డీఏ కార్యాలయంలో గురువారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఈ సమా వేశంలో అధికారం చేపట్టిన ఈ 22 నెలల్లో సాధించిన విజయా లు.. రానున్న 38 నెలల్లో నిర్దేశించుకున్న లక్ష్యాలపై అధికారుల తో చర్చించి ఉత్సాహపరిచేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొం దించారు. తనకు వచ్చిన అవార్డు రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తీసుకురావడానికి, బ్రాండ్ క్రియేట్ చేయడానికి దోహదపడాలనే ఆలోచనలో సీఎం ఉన్నారు.

## అప్పల మృతికి లోకేష్ సంతాపం



అమరావతి(చైతన్యరథం): టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అప్పలనరసింహరాజు మృతికి ఒక ప్రకటనలో మంత్రి నారా లోకేష్ సంతాపం తెలిపారు. ఆయన మృతి బాధాకరం. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఎన్టీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేసిన రాజు సేవలు చిరస్మరణీయమని గుర్తుచేశారు. కుటుం బసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.





## గుంటుపల్లిలో వివాహానికి సీఎం చంద్రబాబు

*గుంటుపల్లిలో బుధవారం బొప్పన సాయి నాగేంద్రవరప్రసాద్ కుమారుడి వివాహ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. వధూవరులు యోగిచందర్ - నర్మదలకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.*

# మీ త్యాగాలతో ఈ స్థాయికి వచ్చా

- వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి బాధ్యత పెంచింది
- ఒక్కడినే అన్న అహం లేదు.. కలిసికట్టుగా పనిచేద్దాం
- దేశ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ ఒక ప్రభంజనం
- నాడు, నేడు, ఎప్పుడూ కార్యకర్తలకు అండగా నిలబడతా
- పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళదాం
- సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల బండిలా నడిపిస్తున్నాం
- వైకాపా సినిమాకు ఎండ్‌కార్డ్ వేసేది పసుపు సైన్యమే
- టీడీపీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సభలో
- నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్



మంగళగిరి(చైతన్యరథం): నాయకులు, కార్యకర్తల త్యాగాలతోనే ఈ స్థాయికి వచ్చా.. చిన్న వయసులో నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశం ఇచ్చారు.. నాయకులు, కార్యకర్తలు, తెలుగుజాతి కోసం అహర్నిశలు కృషిచేస్తానని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ, రాష్ట్ర నూతన కార్యవర్గ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది.టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార ముగింపు సభలో లోకేష్ మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం స్థాపించిన పార్టీ తెలుగుదేశం.. తెలుగుజాతిని ప్రపంచపటంలో పెట్టింది మన లెజెండ్ సీబీఎన్.. దేశ రాజకీయాల్లో మన పార్టీ ఒక ప్రభంజనం. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తీసుకువచ్చారు అన్న ఎన్టీఆర్. రాష్ట్ర రాజకీయాల్లో ఒక చరిత్ర. మనకి గల్లీ పాలిటిక్స్ తెలుసు.. ఢిల్లీ పాలిటిక్స్ తెలుసు. ఓడిపోయి నప్పుడు వెనకడుగు వేయలేదు.. గెలిచినప్పుడు కాలర్ ఎగరేసు కుని తిరగలేదు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించిన పార్టీ తెలుగుదేశం అని ఉద్ఘాటించారు.

## బాధ్యత మరింత పెరిగింది.. టీంగా ముందుకెళదాం

44 ఏళ్ల గొప్ప చరిత్ర ఉన్న పార్టీ తెలుగుదేశం పార్టీ. అలాంటి పార్టీకి నన్ను నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన మన జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, పార్టీ నాయకులకు పేరుపేరునా నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఇప్పుడు నాపై మరింత బాధ్యత పెరిగింది. ఈ పదవి అనౌన్స్ చేసినప్పుడు నేను చంద్రగిరి నియోజకవర్గంలో ఉన్నా. ఏం చేస్తే ఈ పదవికి న్యాయం జరుగుతుందనేవిషయం ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నా. ఓ వైపు బాధ్యత.. మరోవైపు ఈ బరువును కూడా మోయాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం నా ఒక్కడి వల్ల కాదు. వేదికపై ఉన్న పొలిట్ బ్యూరో సభ్యులు, వేదిక ముందున్న నాయకుల వైపు నేను చూస్తున్నా. కలిసికట్టుగా మనం చేయాలి, కలిసి కట్టుగా మనం ముందుకువెళ్లాలి. అప్పుడే మనం అనుకున్నది సాధించగలం. నేను ఒక్కడినే చేయగల ననే అహంకారం నాకు లేదని పేర్కొన్నారు.

## కార్యకర్తల త్యాగాలే స్ఫూర్తి.. అండగా నిలబడతా

నాడు, నేడు, ఎప్పుడూ కార్యకర్తలకు అండగా నిల బడతానని పాదయాత్రలో హామీ ఇచ్చా. నియోజకవర్గ పర్యటనల్లో నేను,చంద్రబాబు ముందుగా కార్యకర్తలను కలుస్తున్నాం. చివరి వ్యక్తితో ఫొటో దిగిన తర్వాతనే తిరిగిరావడం జరుగుతోంది. ఐదేళ్లలో నరకం అనుభ వించాం. అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇక్కడున్న ప్రతి నాయకుడిపై అక్రమకేసులు పెట్టారు,వేధించారు. పుంగ నూరు నియోజకవర్గంలో నామినేషన్ పత్రాలు లాక్కోవాలని అనుకున్నప్పుడు తొడగొట్టి మీసాలు మెలే సిన అంజిరెడ్డి తాత నాకు స్ఫూర్తి. మెడపై కత్తి పెట్టినా జై తెలుగుదేశం, జై చంద్రబాబు అని నినదించి ప్రాణా లు కోల్పోయిన తోట చంద్రయ్య నాకు ఆదర్శం. పల్నాడులో రక్తం కారుతున్నా చివరి ఓటు పడేవరకు బూత్‌లో నిలబడిన మంజుల నాకు స్ఫూర్తి. వారి నాయకుడిని విమర్శిస్తు న్నారని కన్నుపోయే విధంగా చెన్నుపాటి గాంధీపై దాడి చేశారు. అయినా ఎత్తిన జెండా దించకుండా, మడమ తిప్పకుండా జై తెలుగుదేశం అని నినదించిన చెన్నుపాటి గాంధీ నాకు స్ఫూర్తి అని తెలిపారు.

## పార్టీ సిద్ధాంతాలే మనకు బలమైన పునాది

కోటి సభ్యత్వాలతో రికార్డ్స్ బద్దలు కొట్టాం. ప్రమాద బీమా రెండు లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాం. ఇప్పటివరకు సుమారుగా కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్లు ఖర్చు చేశాం. విద్య, వైద్యం, స్వయం ఉపాధికి సాయం అందిస్తున్నాం. కార్యకర్తలకు అండ గా నిలబడతాం. 44 ఏళ్ల ప్రయాణంలో పడ్డాం, లేచాం కానీ నిలబడ్డాం. ఎప్పుడూ అధైర్యపడలేదు. దానికి ప్రధాన కారణం మన సిద్ధాంతాలు. సమాజమే దేవాల యం.. ప్రజలే దేవుళ్లని చెప్పిన గొప్ప నాయకుడు అన్న ఎన్టీఆర్. ఆయన ఆశయాలను కొనసాగించుకుంటూ వచ్చాం. మారుతున్న కాలానికి అనుగుణంగా మనం 6 శాసనాలు రూపొందించుకున్నాం. అందులో మొదటిది తెలుగుజాతి విశ్వఖ్యాతి, యువగళం, స్త్రీశక్తి, పేదల సేవలో–సామాజిక న్యాయం, అన్నదాతకు అండగా, కార్యకర్తే అధినేత. మన పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి బలంగా తీసుకుని వెళ్లాలి.మనం అందరం సిద్ధాంతాల కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.

## జోడెద్దుల బండిలా సంక్షేమం, అభివృది

గడిచిన రెండేళ్లలో సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల బండిలా నడిపిస్తున్నాం. మనం అందిస్తున్న సంక్షేమం దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇవ్వడం లేదు. రూ.200 పెన్షన్‌ను రూ.2 వేలు చేసింది మనం. ఇప్పుడు రూ.4 వేల పెన్షన్ ఇస్తోంది మనమే. దివ్యాంగులకు రూ.6 వేలు, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తోంది మనమే. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెన్షన్ ఇవ్వడం లేదు. ధనిక రాష్ట్రాలు కూడా ఇవ్వడం లేదు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం. దీపం పథకం కింద ఏటా ఉచి తంగా 3 సిలిండర్లు అందిస్తున్నాం. 16,347 ఉపాధ్యా య పోస్టులు భర్తీచేశాం. 6 వేల కానిస్టే బుళ్ల పోస్టులు భర్తీ చేశాం. 10,060 పోస్టులతో జాబ్ క్యాలండర్ విడుదల చేసిందీ మనమే. ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికివందనం ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ ఇచ్చాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలుఇస్తున్నామని వెల్లడించారు.

## మీ సినిమా విధ్వంసం, మా సినిమా అభివృద్ధి

పెట్టుబడుల్లో కూడా ఏపీ నెం.1. దేశానికి వంద రూపాయలు పెట్టుబడి వస్తే మన రాష్ట్రానికి 25 రూపా యల పెట్టుబడి వస్తోంది. మనది గూగుల్.. వైసీపీది గొడ్డలి. ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా చంద్రబాబు అహ ర్నిశలు కష్టపడుతున్నారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, రెన్యూ, టీసీఎస్, కాగ్నిజెంట్, రిలయన్స్.. ఇలా చెప్పు కుంటూ పోతే 800ముఖ్యమైన ప్రాజెక్ట్స్ మన రాష్ట్రానికి వచ్చాయి. యుద్ధప్రాతిపదికన గ్రౌండింగ్ చేస్తున్నామని వివరించారు. మనకి సినిమా చూపిస్తా అంటున్న రప్పా రప్పా బ్యాచ్‌కి ఒకటే చెబుతున్నా. మీ సినిమా విధ్వం సం.. మా సినిమా అభివృద్ధి. మీ అందరి బాలయ్య నా ఒక్కడికే ముద్దుల మామయ్య. బాలయ్యబాబు తొడ కొడితే ఒక్కరు కూడా ఉండరు. ఈ సైకో బ్యాచ్ బతకదు. మీ సినిమాకు ఎండ్ కార్డ్ వేసేది మా పసుపు సైన్యమే. ఇది గుర్తుపెట్టుకోవాలి.

## కార్యకర్తే అధినేత.. అందుకు వారే నిదర్శనం

మై టీడీపీ యాప్ ద్వారా పనిచేసే వారిని గుర్తిస్తున్నాం. టెక్నాలజీతో అనుసంధానం కావాలి. మై టీడీపీ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలి. మీరు చేసే ప్రతి కార్యక్రమం పార్టీకి తెలియ జేస్తే తప్పనిసరిగా జల్లెడ పట్టి మిమ్మల్ని వెతుక్కుంటూ తెలుగుదేశం పార్టీ వస్తుంది. ప్రజల చుట్టూ తిరిగి వారి సమస్యలను పరిష్కరిద్దాం.కచ్చితంగా తెలుగుదేశం పార్టీ గుర్తిస్తుంది. గదుల్లో కూర్చొని పనిచేస్తే మన ఆశయాలు సాధించ లేం. దీనిని అందరూ గుర్తుపెట్టుకోవాలి. నేను బయట ఎంత పోరాడతానో పార్టీ లోపల అంత పోరాడతాను. పార్లమెంట్ వ్యవస్థ తీసుకురావడానికి ఎంతో కష్టపడ్డా ను. అనుకున్న లక్ష్యాలు సాధించే వరకు అహర్నిశలు కష్టపడదాం. పార్టీలో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కదలిక రావాలి. గ్రామ కమిటీలో పనిచేసిన వారు మండల కమిటీకి రావాలి. మండలస్థాయి నుంచి పార్లమెంట్ స్థాయికి, పార్లమెంట్ నుంచి రాష్ట్ర స్థాయికి, అక్కడి నుంచి జాతీయ కమిటీ, పొలిట్ బ్యూరో వరకు రావాలి. అప్పుడే పార్టీలో కదలిక వస్తుంది. ఈ రోజు మండల పార్టీ అధ్యక్షురాలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌ను ఏకంగా పొలిట్‌బ్యూరోలో కూర్చోబెట్టిన ఘనత మన జాతీయ అధ్యక్షులు చంద్రబాబుది.

## ప్రభుత్వ కొనసాగింపు చాలా ముఖ్యం

ప్రభుత్వ కొనసాగింపు అనేది చాలా ముఖ్యం. గుజ రాత్, ఒడిశా లాంటి రాష్ట్రాల్లో ఒకే ప్రభుత్వం వరుసగా ఉండటం వల్ల ఆయా రాష్ట్రాలు అభివృద్ధి చెందాయి. గడిచిన ఐదేళ్లు చాలా నష్టపోయాం. విధ్వంస పాలన మనం చూశాం. అందుకే మనం అందరం కష్టపడాలి. అహర్నిశలు పోరాడాలి. 2029లో మళ్లీ ఎన్డీయే ప్రభు త్వం అధికారంలోకి వచ్చే విధంగా మనం పని చేయా ల్సిన అవసరం ఉంది.రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ నడుస్తోంది. విశాఖ ఉక్కును కాపాడు కున్నాం, విశాఖ రైల్వేజోన్ సాధించుకున్నాం. త్వరలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేస్తాం. అమరా వతి పనులు వేగంగా జరుగుతున్నాయి. దేశంలో ఏ రాష్ట్రానికీ పార్లమెంట్ సాక్షిగా ఇదీ రాజధాని అని చెప్పలేదు. ఒక్క అమరావతి విషయంలోనే చెప్పారు. కేంద్రంలో మన ప్రభుత్వం ఉండటం వల్లే ఇది సాధ్య మైంది. పోలవరానికి నిధులు తీసుకువచ్చాం. చంద్ర బాబు అక్రమ అరెస్ట్ సమయంలో పవనన్న అండగా నిలిచారు. కనీసం పదిహేనేళ్లు ఎన్డీయే ప్రభుత్వం కొనసాగాలని పవనన్న స్పష్టంగా చెప్పారు. పొత్తు ధర్మం అందరం పాటించాలి.కలిసిక ట్టుగా పోరాడాలి. మన రాష్ట్రాన్ని మనం కాపాడుకోవాలి.దీనికి మనందరి సహకారం చాలా అవసరం.

## రాష్ట్రంలో క్రెడిట్ చోరీ జబ్బున్న నాయకుడు ఉన్నారు

మన రాష్ట్రంలో క్రెడిట్ చోరీ జబ్బున్న నాయకుడు ఉన్నారు. సారీ.. మన రాష్ట్రంలో కాదు.. బెంగళూరులో ఉంటారాయన. ఇప్పుడు ఆయనది దీజుచీ–హూ–న్. మూడురోజులు బెంగళూరులో, మూడురోజులు హైద రాబాద్‌లో,ఒకరోజు తాడేపల్లిలో ఉంటారు. ఒక్క కంపె నీ తీసుకురారు.. ఒక్క పనీ పూర్తిచేయరు. మనం తీసుకువస్తే మేమే చేశామంటారు. గూగుల్ ఇందుకు ఉదాహరణ. మొదటి మీటింగ్ విశాఖలో మనం రహ స్యంగా పెట్టుకున్నాం. తర్వాత నేను ఫాలోఅప్ చేశా. వారు వచ్చి సీఎంని కలిశారు. వారు రెండు, మూడు మార్పులు కావాలి చట్టంలో అంటే.. కేంద్రంతో మాట్లా డాం. ఇప్పుడు క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారు. గూగుల్‌కు భూములు కేటాయిం చవద్దని ఆ పార్టీ ఎంపీనే కోర్టులో పిల్ వేస్తారు. ఎంత అన్యాయమో మనం ఆలోచించాలి. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వివేకానందరెడ్డిని వారే చంపి నెపం మనపై వేశారు. దుష్ప్ర చారాలను తిప్పికొట్టలేకపోయాం. మనందరిపై బాధ్యత ఉంది. క్రెడిట్ చోరీ డిజార్డర్ ఉన్న వ్యక్తి ఇంకా అనేక అబద్ధాలు చెబుతాడు. ప్రజలను మభ్యపెడతారు. మనం తిప్పికొట్టాల్సిన బాధ్యత ఉందని తెలిపారు.

## నాయకులను తయారుచేద్దాం

ఈ భూమిపైన ఎవరూ శాశ్వతం కాదు.. టీడీపీ అనే వ్యవస్థ శాశ్వతం. మనం పార్టీని బలోపేతం చేద్దాం. పది మంది నాయకులను తయారుచేద్దాం. సామాన్య కార్యకర్తను నాయకుడిగా తయారుచేద్దాం. అహర్నిశలు కృషిచేసి పార్టీని బలోపేతం చేద్దాం. ఈ రోజు పార్టీ ఒక వ్యక్తిని ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్య క్షుడిగా, సెక్రటరీగా, ఆర్గనైజ్ సెక్రటరీగా గుర్తించింది అంటే.. మన చంద్రబాబు జల్లెడ పట్టి గుర్తించడం జరిగింది. వారిని గౌరవించాలి. వారి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. అహంకారం ఉంటే ఎమవుతుందో మనం 2024 ఎన్నికల్లో చూశాం. 151కాస్తా 11 అయ్యాయి. ప్రతిపక్ష హోదా రాలేదు. మనం కలిసి కట్టుగా పని చేద్దాం.మన సమస్యలు మనమే పరిష్కరించు కుందాం. నిత్యం ప్రజల్లో ఉండాలి. ప్రజల సమస్యలు పరిష్కరించాలి.

## మీ త్యాగాలతోనే నేను ఈ స్థాయికి వచ్చాను

చిన్న వయసులో నాకు అద్భుతమైన అవకాశం ఇచ్చారు. నేను ఈ స్థాయికి వచ్చానంటే దానికి కారణం వేదికపై ఉన్న నాయకులు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కోటిమంది కార్యకర్తలు. మీ త్యాగాలతోనే నేను ఈ స్థాయికి వచ్చాను. ఆ రోజు మీరు నాతో నడిచారు కాబట్టే యువగళం పాదయాత్ర సక్సెస్ అయింది. ఏ చిన్న సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకు రావాలి. నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించి నందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియ జేస్తున్నా. మీకోసం, కార్యకర్తల కోసం, ఆంధ్రుల కోసం, తెలుగుజాతి కోసం నేను పనిచేస్తానని హామీ ఇస్తున్నా. అద్భుత మైన అవకాశం ఇచ్చిన అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



చైతన్యరథం



# పదవి వచ్చిందన్న అహంకారం వద్దు

- అందరినీ కలుపుకుని ముందుకుసాగాలి
- మిమ్మల్ని ఎలా గుర్తించామో..
- నాయకత్వాన్ని అలానే గుర్తించాలి
- మీరు చేసే ప్రతి పని పార్టీకి వర్తిస్తుంది
- పార్టీ నూతన కార్యవర్గ సభ్యులకు
- శిక్షణ తరగతుల్లో నారా లోకేష్ దిశానిర్దేశం

మంగళగిరి(చైతన్యరథం): పదవి వచ్చిందనే అహంకారం వద్దు.. అందరినీ కలుపుకుని ముందుకు సాగాలని టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం పార్టీ కేంద్ర కార్యాలయంలో నూతన కార్యవర్గ కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవం అనంతరం నిర్వహించిన శిక్షణ తరగతుల కార్యక్రమానికి మంత్రి హాజరై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాస్ విన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పార్టీ నాయకులు నియోజకవర్గాల్లో అందరినీ కలుపుకుని ముందుకుసాగాలి. మిమ్మల్ని ఎలా గుర్తించామో మీరు కూడా నాయకత్వాన్ని గుర్తించాలి. నాయకుల పనితీరుపై ప్రతి మూడు నెలలకోసారి బేరీజు వేస్తాం. నిన్నటి వరకు వేరు.. ఈ రోజు నుంచి వేరు. మీరు చేసే ప్రతి పని పార్టీకి వర్తిస్తుంది. మీరు మంచి చేస్తే పార్టీకి మంచి జరుగుతుంది. ప్రతి అంశంపైనా అవగాహన ఉండాలి. పార్టీ నిర్మాణం, నిర్వహణపై అవగాహన పెంచు కోవాలి. సమన్వయంతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.





# టీడీపీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

- నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్
- 44 ఏళ్ల పార్టీ చరిత్రలో కొత్త ఉత్సాహం



మంగళగిరి(చైతన్యరథం): తెలుగుదేశం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించారు. పార్టీ అధినాయకత్వం పాత, కొత్త నాయకుల కలయికతో కమిటీలను ఏర్పాటు చేయడం ప్రత్యేకతగా నిలిచింది. టీడీపీ చరిత్రలో తొలిసారిగా మండల, క్లస్టర్‌స్థాయి నేతలకు కూడా పొలిట్‌బ్యూరోలో చోటు కల్పించడం విశేషంగా మారింది. 'కార్యకర్తే అధినేత' అనే నినాదాన్ని నిజం చేస్తూ కష్టపడి పనిచేసిన నాయకులకు కమిటీల్లో ప్రాధాన్యం ఇచ్చారు. 44 ఏళ్ల పార్టీ చరిత్రలో కూడాకొత్త ఉత్సాహం కనిపించేలా టీడీపీ హైకమాండ్ కమిటీలను నియమించింది. సీనియర్ నాయకుల అనుభవాన్ని, జూనియర్ నాయకుల దూకుడును సమపాళ్లలో కలిపి కమిటీలను రూపొందించారు. ఈ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే మంగళగిరి క్లస్టర్ ఇన్‌చార్జ్ గుత్తికొండ ధనుంజయ్, గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి కూడా హైలెట్‌గా నిలిచారు. గతంలో సోషల్ మీడియాలో చురుకుగా పనిచేసిన పలువురికి కూడా కొత్త కమిటీల్లో అవకాశం ఇవ్వడం గమనార్హం. ఎన్టీఆర్, చంద్రబాబు అధ్యక్షులుగా ఉన్న కాలంలో లాగే, ఈసారి కూడా సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి కీలక బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ఈ కొత్త కార్యవర్గంతో టీడీపీకి మరింత బలం చేకూరుతుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## నేడు టెన్త్ ఫలితాల విడుదల

అమరావతి(చైతన్యరథం): టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు గురు వారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను ఎస్ ఎస్‌సీ ఫలితాల పోర్టల్: results.bse.ap.gov.inలో, మనమిత్ర వాట్సాప్: 9552300009కి "హాయ్" అని పంపి తెలుసుకోవచ్చు. హెడ్ మాస్టర్లు స్కూల్ స్కూల్ లాగిన్ల ద్వారా ఫలితాలు తెలుసుకోవచ్చు.

చైతన్యరథం






# నవశకానికి నాంది

టీడీపీ పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కార్యవర్గం కొలువు దీరిన వేళ..లోకేష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రమాణం చేసిన ఆయన క్యాడర్‌లో ఉత్సాహం నిం పారు. యువగళం..జనగళమై..ప్రజాబలమే..గెలుపు బాటన నడిపి ప్రజా హృదయాలను గెలుచుకున్న లోకేష్ ప్రస్థానం స్ఫూర్తి దాయకం. కార్యకర్తలకు తోడుగా.. నేతల మధ్య వారధిగా.. పార్టీకి రథసారథిగా ఆయన చూపిన తెగువ అనితర సాధ్యం. అందుకే సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో సమర్థుడు కాబట్టే బాధ్యతలు అప్పగించినట్లు వ్యాఖ్యానించారు.

















చైతన్యరథం





# జాతీయ సారథికి అభినందనల వెల్లువ

### వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్ ప్రమాణస్వీకారం - పార్టీ కేంద్ర కార్యాలయంలో సందడి

మంగళగిరి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీలో మరో చరిత్రా త్మక ఘట్టం ఆవిష్కృతమైంది. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్‌కు పలు వురు నేతలు అభినందనలు తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయం లోని తన చాంబర్‌లో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి అభినందనలు తెలిపారు. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెం ట్‌గా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని నేతలు ఆకాంక్షించారు. అంతకుముందు ఎంపీ, టీడీపీ పార్లమెం టరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు జన్మదినోత్సవాన్ని పురస్క రించుకుని లోకేష్ సమక్షంలో కేక్ కట్ చేశారు. కేక్ తినిపించి మంత్రి నారా లోకేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



























చైతన్యరథం

# హజ్ యాత్రికులకు నష్ట పరిహారం

- సకాలంలో లగేజీ చేరనందుకు స్పందన
- ప్రభుత్వ తక్షణ స్పందనతో కేంద్రం చర్యలు
- 177 మంది అకౌంట్లకు పరిహారం జమ
- మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్ వెల్లడి



అమరావతి (చైతన్యరథం): విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుండి హజ్ యాత్రకు బయలుదేరిన 177 మంది యాత్రికులకు సకాలంలో లగేజీ చేరనందుకు సంబంధిత విమానయాన సంస్థ నుంచి నష్టపరిహారం చెల్లించినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ఈ నెల 18, 19 తేదీలలో హజ్ యాత్రకు బయలుదేరిన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని సౌకర్యాలు, యాత్ర విజయవంతం కోసం సహాయ సహకారాల ప్రణాళికను అమలు చేయడం జరిగిందని వెల్లడించారు. ఇందులో భాగంగా ఈనెల 19న 177 మంది హజ్ యాత్రికులు విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచి మదీనాకు వెళ్లడం జరిగిందన్నారు. అయితే వీరికి సంబంధించిన లగేజీని మదీనాలో దిగే సమయానికి సకాలంలో చేరవేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. విషయం తెలిసిన వెంటనే జాప్యానికి చింతి స్తూ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కే.రామ్మోహన్‌నాయుడు, కేంద్ర మైనారిటీ మంత్రిత్వ శాఖ మంత్రి కిరణ్ రిజుజుతో పాటు కేంద్ర హజ్ కమిటీ దృష్టికి తాను తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఈ విష యంపై సంబంధిత విమానయాన సంస్థపై చర్యలు కూడా తీసు కోవాలని తాను కోరడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, మైనారిటీ మంత్రిత్వ శాఖ తక్షణ స్పందనతో లగేజీ విషయంపై కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లడంతో జరిగిన నష్టానికి పరిహారంగా సంబంధిత విమానయాన సంస్థ హజ్ యాత్రికులకు పరిహారం విడుదల చేసిందన్నారు. ఒక్కొక్కరికి రూ.13800(150 యుఎస్ డాలర్లు) ప్రకారం 177 మంది ప్రయాణికులకు కేంద్ర హజ్ కమిటీ ద్వారా వారి వారి బ్యాంకు ఖాతాలకు నష్టపరిహారం మొత్తాన్ని బుధవారం జమ చేయడం కూడా పూర్తి అయిందని తెలిపా రు. మైనారిటీల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హజ్ యాత్రికుల సమస్యపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిష్కారం కోసం కృషి చేసిన మైనారిటీ శాఖ కార్యదర్శి శ్రీధర్, సీఈవో గౌస్ పీర్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్, సభ్యులను అభినందించారు.

## ఏపీకి భారీగా కేంద్రం నిధులు

- స్పందించిన కేంద్రమంత్రి పెమ్మసాని
- ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు



అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నిధులు విడుదల చేసింది. దీనదయాళ్ అంత్యోదయ యోజన (డీఏవై), జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) కింద రూ.207 కోట్ల నిధులు విడుదల చేసింది. 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్రానికి ఈ నిధులు మంజూరు చేసింది. ఈ నిధుల విడుదలపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. ఈ నిధులు గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహిళలకు ఆర్థిక స్వావలంబనను పెంపొందించి, కుటుంబాల ఆదాయ స్థాయిని మెరుగుపరుస్తాయని తెలిపారు. అలాగే ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్‌ను వేగవంతం చేస్తూ, వేలాది కుటుంబాలను పేదరికం నుంచి బయటపడేందుకు దోహదపడతాయని చెప్పారు. కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణాభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో గ్రామీణ అభివృద్ధి, మహిళా సాధికారతలో దేశానికి ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిధులలో ప్రతి రూపాయి మహిళా శక్తికి బలమైన నాంది, ఆత్మ నిర్భర ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి దృఢమైన అడుగు' అని పేర్కొన్నారు.

# మంత్రిని కలిసిన గ్రూప్ 1 అభ్యర్థులు



అమరావతి(చైతన్యరథం): తాడేపల్లిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని గ్రూప్-1 అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్డీవోలుగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు ఈ సందర్భంగా మంత్రి అభినందనలు తెలిపారు. 2023 గ్రూప్-1లో వీరంతా విజయం సాధించారు. తమ బాధ్యతలను సమర్థం గా నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా నందిపాటి ఎల్.వి.సుబ్బారెడ్డి, షైక్ ఈసుబ్ సలాం, లగుడు సంతోషి, సి.ప్రియవర్ధిని దత్, గొల్లవిల్లి భరత్ కుమార్, ఇయిత వెంకట రామయ్య అధికారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, మంత్రి గారి ద్వారా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## సముద్ర వనరుల ద్వారా స్థానిక సముదాయాలకు

# లాభాలు చేకూరేలా చర్యలు

- మత్స్య సంపదలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం
- అక్రమ వేటపై కట్టడి చర్యలు
- జీవవైవిధ్య చట్టం అమలు ద్వారా మత్స్యకారులు, రైతులకు లెవీ బదిలీ
- ఏపీఎస్‌బీబీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్



విజయవాడ (చైతన్యరథం): బయోడైవర్సిటీ చట్టంలోని యాక్సెస్ అండ్ బెనిఫిట్ షేరింగ్ విధానం ద్వారా ప్రకృతి వనరుల వినియోగం వల్ల వచ్చే లాభాలను స్థానిక ప్రజలకు చేరవేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఏపీఎస్‌బీబీ చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ తెలిపారు. యాక్సెస్ అండ్ బెనిఫిట్ షేరింగ్ వల్ల చేపల ధరలు ఏమాత్రం పెరిగే అవకాశం లేదన్నారు. చెన్నైలోని నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ, అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డు సంయుక్తంగా... సముద్ర జీవ వైవిధ్య వనరుల వినియోగంలో యాక్సెస్-బెనిఫిట్ షేరింగ్ విధానంపై ప్రత్యేక వర్క్ షాపును స్థానిక మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ... ఎర్రచందనం విక్రయాల ద్వారా రైతులకు 5% లాభం అందజేస్తూ గత మూడు నెలల్లో సుమారు రూ.7కోట్లు పంపిణీ చేశామని వెల్లడించారు. ఇదే విధానాన్ని సముద్ర సంపదపై కూడా అమలు చేసి మత్స్యకారులకు ప్రయోజనాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 2025లో సముద్ర సంపద విలువ రూ.4,155 కోట్లకు చేరిందని, ప్రాసెసింగ్ తర్వాత అది దాదాపు రూ.9వేల కోట్లకు పైగా పెరుగుతుందని తెలిపారు. ఎగుమతిదారుల టర్నోవర్ ఆధారంగా 0.2% నుంచి 0.6% వరకు ఏబీఎస్ రుసుము వసూలు చేసి ఆ నిధులను మత్స్యకారుల సంక్షేమానికి వినియోస్తామన్నారు. రాష్ట్రంలోని సుమారు 13వేల బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీలను బలోపేతం చేసి ఈ నిధులను జెట్టీలు, ఇన్సూరెన్స్, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు. సముద్ర జీవ వైవిధ్య సంరక్షణతో పాటు మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం సాధన ఈ విధానం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

సముద్ర వనరులను పరిశోధనలు, ఔషధ తయారీ, ఫార్మాస్యూటికల్స్ వంటి రంగాల్లో వినియోగించే సంస్థలు పొందే లాభాల్లో కొంత భాగం స్థానిక సముదాయాలకు చేరేలా చూడటం ఏబీఎస్ విధానం ప్రధాన లక్ష్యమని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు పంపిణీ చేసిన రూ.145 కోట్ల ఏబీఎస్ నిధుల్లో ఆంధ్రప్రదేశ్ ఒక్కటే రూ.97 కోట్లు పొందడం గర్వకారణమన్నారు. ప్రస్తుతం ఈ నిధుల్లో ఎక్కువ భాగం ఎర్రచందనం, వ్యవసాయ రంగం ద్వారా లభిస్తున్నాయని... భవిష్యత్తులో సముద్ర వనరుల ద్వారా కూడా స్థానిక బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీలకు మరింత లాభం చేకూర్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ చైర్మన్ వీరేంద్ర తివారీ మాట్లాడుతూ... సముద్ర వనరుల వినియోగంలో యాక్సెస్ అండ్ బెనిఫిట్ షేరింగ్ విధానం కీలకమని తెలిపారు. ఈ దిశగా 2025లో 'అక్వాటిక్ జెనెటిక్ ఎక్స్‌పర్ట్ కమిటీ' ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా తీరప్రాంతాల్లో లభించే చేపల జాతుల సమగ్ర జాబితాను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ జాబితా ఆధారంగా ఎగుమతిదారుల టర్నోవర్ లేదా ఉత్పత్తుల విలువను బట్టి ఏబీఎస్ నిధులను వసూలు చేసి తీరప్రాంత మత్స్యకారులకు అందజేస్తామని వివరించారు.

కొల్లేరు సరస్సు జీవ వైవిధ్య పరిరక్షణపై ప్రభుత్వం దృష్టి సారించిందని... కాంటూర్ పరిమితులు, స్థానికుల జీవనోపాధిని సమతుల్యంగా కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ స్థానిక ప్రజల జీవనోపాధిని రక్షించడం ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ సముద్ర కాలుష్య నియంత్రణతో పాటు మత్స్యకారుల జీవనోపాధి బలోపేతం అవసరమన్నారు. తీర ప్రాంతాల్లో పారిశ్రామిక వ్యర్థాలు, పట్టణ మురుగునీరు సముద్రంలో కలవడం వల్ల చేపల నిల్వలు గణనీయంగా తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న వలలు, బాటమ్ ట్రాలింగ్ వంటి అశాస్త్రీయ పద్ధతులు సముద్ర వనరులకు నష్టం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. మత్స్యకారులపై వేట ఒత్తిడి తగ్గించేందుకు మెరికల్చర్, చేపల అనుబంధ ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. పాత పద్ధతుల బదులుగా హైజీనిక్ డ్రైయింగ్, వాల్యూ అడిషన్ సాంకేతికతలను ప్రోత్సహించాలని కోరారు. వేట నిషేధ కాలంలో ప్రభుత్వం రూ.20వేలు అందిస్తోందన్నారు.

మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు 1053 కిలోమీటర్ల సుదీర్ఘ తీర రేఖ, 350 ల్యాండింగ్ సెంటర్లు, 555 తీర ప్రాంత గ్రామాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 8 లక్షల మంది సముద్ర తీర ప్రాంత ప్రజలు, 20 లక్షల మంది అంతర్భాగ మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారని వివరించారు. 2025-26లో దేశ సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో రాష్ట్రం 38% వాటా (సుమారు రూ.27వేల కోట్లు) సాధించిందని తెలిపారు. భారీ ట్రాలర్ల ద్వారా జరిగే విధ్వంసకర చేపల వేట చిన్న మత్స్యకారులకు ఇబ్బందిగా మారిందని, దీనిని అరికట్టేందుకు మత్స్య, అటవీ శాఖల అధికారులు, మెరైన్ పోలీసులతో కలిసి నిఘా కమిటీలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

సమావేశంలో ప్రభుత్వ సలహాదారు బి.మల్లికార్జునరావు, ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, అటవీ శాఖ సీసీఎస్ నాగేశ్వరరావు, బయోడైవర్సిటీ నిపుణులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య సంరక్షణకు వినూత్న పథకం

- ముందస్తు నివారణ లక్ష్యంగా 47 రకాల పరీక్షలు
- ముఖ్యమంత్రి హామీ అమలు దిశగా నిర్ణయం
- సాలీనా రూ.163 కోట్ల వ్యయం అంచనా
- 57 లక్షల మందికి సమగ్ర పరీక్షలే లక్ష్యం
- త్వరలో 104 సంచార వైద్య వాహనాలతో సేవలు
- పకడ్బందీగా వ్యక్తుల డిసీజ్ ప్రొఫైల్స్ రూపకల్పన
- ఆమోదించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి(చైతన్యరథం): రోగాల ముందస్తు నివారణ చర్యల కు ప్రాధాన్యతనిస్తూ వ్యక్తుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసేందుకు సమగ్ర వైద్య పరీక్షలు చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ అమలు దిశగా వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన నిర్ణయాన్ని తీసుకుంది. 104 సంచార వైద్య వాహనాల (ఎంఎంయూలు) ద్వారా సాలీనా రూ.162.72 కోట్ల వ్యయంతో గుర్తించిన ప్రతి వ్యక్తికీ 47 రకాల వైద్య పరీక్షలు చేపట్టే పథకానికి వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ఆమోదం తెలిపారు. ఎన్‌సీడీ సర్వేలో వివిధ రోగాలపాలైన లేదా అవకాశ మున్న వారిగా గుర్తించిన వారితో పాటు సంక్షేమ విద్యా వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులతో కలిపి ఏడాదికి 56.40 లక్షల మందికి ఒక్కొక్కరికీ 47 రకాల పరీక్షలు చేస్తారు. జబ్బులకు గురైన వారికి చికిత్స అందిస్తున్న ప్రస్తుత విధానానికి భిన్నంగా పౌరుల ప్రస్తుత సమగ్ర ఆరోగ్య పరిస్థితిని వివిధ పరీక్షల ద్వారా మదింపు చేయడం..తద్వారా రోగాలను నివారించే దిశగా తగు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి పలు సందర్భాల్లో వైద్యారోగ్య శాఖను ఆదేశించారు. ఈ మేరకు విస్తృత చర్చల అనంతరం 104 వాహనాల ద్వారా అమలుకానున్న పౌరుల ఆరోగ్య తనిఖీ(సిటిజన్ హెల్త్ స్క్రీనింగ్) పథకానికి మంత్రి ఆమోదం తెలిపారు.

### కొత్త పుంతలు తొక్కనున్న 104 సేవలు

ఇప్పటివరకు 104 సంచార వైద్య వాహనాల ద్వారా గ్రామ స్థాయిలో 15 రోజులకోసారి ఆరు రకాల పరీక్షలు మాత్రమే జరు గుతున్నాయి. అవి ర్యాండమ్ బ్లడ్ షుగర్, యూరిన్ షుగర్, హిమోగ్లోబిన్, మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణకు ర్యాపిడ్ డయోగ్నో స్టిక్ టెస్ట్, యూరిన్ అల్బుమిన్, గర్భధారణ నిర్ధారణకు మూత్ర పరీక్ష. ఇవి కూడా ఎక్కువ భాగం అంతగా ఖచ్చితమైన ఫలితాలి వ్వని ర్యాపిడ్ కిట్స్ ద్వారా జరుగుతున్నాయి. దీంతో పాటు గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో వ్యక్తుల డిసీజ్ ప్రొఫైల్స్, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల తయారీ కావడం లేదు. దీనికి భిన్నంగా నూతన 104 సేవల అమల్లో భాగంగా 11 అంశాలకు సంబంధించి గుర్తించిన ప్రతి వ్యక్తికీ మొత్తం 47 రకాల పరీక్షలు జరుగుతాయి.

### 11 అంశాలు..47 రకాల పరీక్షలు

కాలేయ సంబంధిత పరీక్షలు(ఎల్ఎఫ్‌టి)-8, మూత్ర విశ్లేషణ-6, కొవ్వు సంబంధిత పరీక్షలు(లిపిడ్ ప్రొఫైల్)-5, తెల్ల రక్త కణాల కౌంట్-5, ఎర్ర రక్త కణాల కౌంట్-5, ఎలక్ట్రొలైట్ పరీక్ష లు-4, మూత్ర పిండాల పరీక్షలు(ఆర్ఎఫ్‌టీ)-3, గ్లూకోజ్ పరీక్షలు-3, కోయాగ్యులేషన్ పరీక్షలు(రక్తం గడ్డకట్టడానికి సంబం ధించి)-2, ఇఎస్ఆర్( ఇన్‌ఫెక్షన్‌కు సంబంధించి)-1తో పాటు 5 ఇతర పరీక్షలు నిర్వహిస్తారు.

### హెల్త్ రికార్డులతో ప్రయోజనాలు

ఈ సమగ్ర వైద్య పరీక్షల ఫలితాల ఆధారంగా పౌరుల ఆరోగ్య స్థితికి సంబంధించి వ్యక్తిగత స్థాయిలో డిసీజ్ ప్రొఫైల్స్, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను రూపొందించి సంజీవని పథకం కింద ఆయా వ్యక్తులకు ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మున్ముందు రోగాల నివారణకు చేపట్టాల్సిన విషయాలపై తగు సూచనలు అందించ డం జరుగుతుంది. ఈ మేరకు ఈ సమగ్ర వైద్య పరీక్షల ప్రారం భం రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణ దిశగా ఎంతో ప్రాముఖ్యమైన చర్య అని మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు.

### సర్వీస్ ప్రొవైడర్ పాత్ర

మొదటి దశలో ఐదేళ్ల కాల పరిమితితో కూడిన ఈ పథకంలో భాగంగా..మొత్తం 904 వాహనాలతో 104 సంచార వైద్య సేవలు నిర్వహిస్తున్న సర్వీస్ ప్రొవైడర్ ప్రతి వాహనంలోనూ సెమీ ఆటోమేటిక్ బయో కెమిస్ట్రీ ఎనలైజర్, సిబిసి మెషీన్ 3 పార్ట్ ఎనలైజర్, మైక్రోస్కోప్ మరియు ఇంక్యుబేటర్‌ను స్వంత ఖర్చుతో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు వివిధ పరీక్షల నిర్వహణకు అవసరమయ్యే రిఏజెంట్లను ఇతర వస్తువులను కూడా సమకూర్చాలి. ప్రతి వాహనం రోజుకి 20 మంది చొప్పున నెలలో 26 పని దినాల్లో మొత్తం 520 మందికి 47 చొప్పున పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది.

### సత్వర ప్రారంభానికి మంత్రి ఆదేశం

విస్తృత ప్రయోజనాల లక్ష్యంగా రూపొందించిన ఈ పథకాన్ని అతి త్వరలో ప్రారంభించడానికి తగు చర్యలు చేపట్టాల్సిందిగా శాఖ ఉన్నతాధికారులను మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించా రు. రెండు నెలల్లో ఈ సేవలు ప్రారంభించడానికి కృషి చేస్తున్నా మని అధికారులు మంత్రికి వివరించారు.

# సైబర్ మోసాలపై జాగ్రత్త

### కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



అమరావతి(చైతన్యరథం): డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగే సైబర్ మోసాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. పోలీసు అధికారులుగా నటిస్తూ, సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్ చేసి డబ్బులు వసూలు చేస్తారని తెలిపారు. ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఇలాంటి నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఒక వీడియోను ఎక్స్ వేదికగా షేర్ చేశారు. 'డిజిటల్ అరెస్ట్ మోసాలతో జాగ్రత్త!. ఇటీవలి కాలంలో సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ పేరుతో కొత్త రకం మోసాలకు పాల్పడుతున్నారు.

పోలీసు అధికారులు లేదా ప్రభుత్వ ప్రతినిధులుగా నటిస్తూ వీడియో కాల్స్ ద్వారా ప్రజలను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అజ్ఞాత కాల్స్, సందే హాస్పద లింకులు, ఓటీపీలు ఎప్పటికీ షేర్ చేయకండి. ఏదైనా అనుమానం కలిగితే వెంటనే స్థానిక పోలీసులను సంప్రదించండి లేదా 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి. స్మార్ట్‌గా ఉండండి, సురక్షితంగా ఉండండి. ఒక్క క్లిక్ మీ భవిష్యత్తును మార్చొచ్చు. జాగ్రత్తగా ఆలోచించండి' అని తెలిపారు.

# హైకోర్టు ఏజీపీల గౌరవ వేతనం 25 శాతం పెంపు

- రూ.55,000కు పెంచుతూ సీఎం నిర్ణయం
- జిల్లా కోర్టుల్లో జీపీలు, ఏజీపీలకూ ప్రతిపాదన
- న్యాయ, మైనారిటీ సంక్షేమ మంత్రి ఫరూక్



అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం హైకో ర్టులో పనిచేస్తున్న ఏజీపీల (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లు) గౌరవ వేతనాన్ని 25 శాతం పెంచుతూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు ఏజీపీలకు ప్రస్తుతం ఇస్తున్న వేతనం మొత్తం రూ.44,000 నుంచి రూ. 55,000కు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. వీరితో పాటు జిల్లా కోర్టుల్లో పనిచేస్తున్న జీపీలు, ఏజీపీలకు కూడా వేతనాన్ని పెంచేందుకు ప్రతిపాదనలు పంపాలని సీఎం ఆదేశించినట్లు వెల్లడించా రు. రాష్ట్రంలో 86 మంది దాకా ఏజీపీలు ఉన్నారని, వారి గౌరవ వేతనం పెంపుతో ప్రభుత్వంపై సంవత్సరానికి రూ.1,13,52,000 అదనపు భారం పడుతుందని మంత్రి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా లా ఆఫీసర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పెంపుదల చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి ఫరూక్ ధన్యవాదాలు తెలిపారు. గౌరవ వేతనం పెంపుదలకు కృషి చేసిన న్యాయ శాఖ కార్యదర్శి ప్రతిభాదేవిని అభినందిస్తూ జిల్లా కోర్టుల్లో జీపీలు, ఏజీపీలకు కూడా గౌరవ వేతనం పెంపు దలను వర్తింప చేయడానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

# లోకేష్‌కు నందమూరి రామకృష్ణ శుభాకాంక్షలు



అమరావతి(చైతన్యరథం): చంద్రబాబు ఆధ్వర్యంలో టీడీపీ పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ఎన్టీఆర్ తన యుడు నందమూరి రామకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రమాణస్వీకారం చేసి నవశకానికి నాంది పలికిన లోకేష్‌కు అభినందనలు తెలిపారు.

# విశాఖ ఎక్స్‌ప్రెస్ ఘటన..

### బాధితురాలికి రాయపాటి శైలజ పరామర్శ

అమరావతి (చైతన్యరథం): విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. బుధవారం ఈ ఘటనలో బాధిత మహిళకు రాయపాటి శైలజ వీడియో కాల్ చేసి ఫోన్‌లో పరామర్శించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను బాధితురాలిని అడిగి తెలుసుకున్నారు. పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన దంపతులు ఉపాధి నిమిత్తం విశాఖ పట్నంలో నివసిస్తున్నారు. గత ఆదివారం సాయంత్రం వివాహిత విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించింది. గుర్తు తెలియని వ్యక్తి జనరల్ బోగిలో ఉన్న ఆమెను ఏసీ బోగిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాధిత మహిళ.. రెంటచింతల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వైద్యపరీక్షల నిమిత్తం ఆమెను మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ అత్యాచార ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టారు. ఈ అత్యాచార ఘటన బహిర్గతం కావడంతో ఈ ఘటనపై రెంటచింతల పోలీసులతో మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ మాట్లాడారు. నిందితుడిని కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. న్యాయం చేస్తామని బాధి తురాలికి హామీ ఇచ్చారు.

### పోలీసుల అదుపులో నిందితుడు

విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో వివాహి తపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని విజయవాడ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాకు చెందిన శౌరవ్ బగ్గి.. వివాహిత నోరు మూసేసి అత్యాచారానికి పాల్పడ్డా డు. ఇంటికి వచ్చాక భార్య ముభావంగా ఉండటం చూసి భర్త గట్టిగా నిలదీయడంతో జరిగిన విషయం చెప్పింది. దీంతో మంగళవారం రెంటచింతల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విజయవాడ రైల్వే పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. బుధవారం నిందితుడిని గుర్తించిన రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# అనంతపురం మీదుగా తిరుపతికి రైలు



అనంతపురం (చైతన్యరథం): ఉమ్మడి అనంతపురం జిల్లా మీదుగా తిరుపతి-అకోలా మధ్య రెగ్యులర్ బేసిస్‌పై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అకోలా-తిరుపతి వీక్లీ ఎక్స్‌ప్రెస్ (17430) మే 3వ తేదీ నుంచి శుక్రవారాలలో ఉదయం 9-15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఎనిమిదిన్నరకు తిరుపతికి చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (17429) మే 8వ తేదీ నుంచి ఆదివారాలలో మధ్యాహ్నం 12-25 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు అకోలాకు చేరుతుందన్నారు. ఈ రైలు తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లె రోడ్డు, ములకలచెరువు, కదిరి, ధర్మవరం, అనంతపు రం, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, వనపర్తి రోడ్డు, మహబూబ్‌నగర్, కాచిగూడ, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, నాందేడ్, పూర్ణా, బస్మత్, హింగోలి దక్కన్, వాసిం మీదగా అకోలాకు చేరుకుంటుందని తెలిపారు.

## టీడీపీ సీనియర్ నేత అప్పల నరసింహరాజు మృతి

●సంతాపం తెలియజేసిన చంద్రబాబు, పలువురు రాజకీయ ప్రముఖులు



విశాఖపట్నం (చైతన్యరథం): సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కలిగిన టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి అప్పల నరసింహరాజు కన్నుమూశారు. విశాఖ జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగిలోని తన నివాసంలో ఈ తెల్లవారుజామున ఆయన కన్నుమూశారు. 82 ఏళ్ల వయసులో అనారోగ్య కారణాలతో ఆయన తుదిశ్వాస విడిచారు. భీమునిపట్నం కోటలో అజేయమైన నాయకుడిగా ఆయనకు పేరుంది. 1985 నుంచి 1999 వరకు వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి, భీమిలి అంటే అప్పల నరసింహరాజు అన్నంతగా గుర్తింపు పొందారు. ఎన్టీఆర్ హయాంలో మంత్రిగా పనిచేసిన ఆయన, నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. క్రమశిక్షణకు మారుపేరుగా, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన చెరగని ముద్ర వేశారు. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే జిల్లా వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు విషాదంలో మునిగిపోయాయి. చంద్రబాబుతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు ఆయన మరణానికి సంతాపం తెలియజేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. పాండ్రంగిలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

## మాజీ మంత్రి అప్పల నరసింహరాజు భౌతికకాయానికి స్పీకర్ అయ్యన్న ఘన నివాళి



అనకాపల్లి (చైతన్యరథం): మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు ఆర్.ఎస్.డి.పి అప్పల నరసింహరాజు మరణవార్త తెలుసుకున్న ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారు అక్కడికి చేరుకుని ఆయన పార్థివదేహానికి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా అప్పల నరసింహరాజుతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని స్పీకర్ గుర్తుచేసుకున్నారు. 82 ఏళ్ల అప్పల నరసింహరాజు అనారోగ్య కారణాలతో విశాఖ జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగిలో ఈ తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. భీమునిపట్నం (భీమిలి) నియోజకవర్గం నుంచి 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యేగా వరుస విజయాలు సాధించిన ఆయన, ఎన్టీఆర్ హయాంలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

## మాజీ మంత్రి రాజు మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం (చైతన్యరథం): మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్ఎస్‌డీపీ అప్పల నరసింహరాజు బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. పద్మనాభం మండలం పాండ్రంగిలోని నివాసంలో ఆయన భౌతిక కాయానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాళు లర్పించారు. నిజాయతీ రాజకీయాలకు నిలువుటద్దంగా నిలిచిన అప్పల నరసింహరాజు.. ప్రజలు, పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. ఆయన కుమారుడు పృథ్వీ, కుటుంబ సభ్యులను గంటా ఓదార్చి.. ధైర్యం చెప్పారు.

## కేడీసీసీ బ్యాంక్ డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రారంభం

మచిలీపట్నం (చైతన్యరథం): కేడీసీసీ బ్యాంక్ డిజిటలైజేషన్ కార్యక్రమంలో భాగంగా, బ్యాంక్‌కు సంబంధించిన అన్ని సర్వీసులను ఒకే పోర్టల్‌లో అందుబాటులోకి తీసుకువచ్చే నూతన వ్యవస్థను బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం బుధవారం మచిలీపట్నంలో అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... భవిష్యత్తులో బ్యాంక్ అందించే అన్ని సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేసి, మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా సిబ్బంది, ఖాతాదారులు మరియు సంబంధిత వర్గాలు బ్యాంక్ సర్వీసులను ఎప్పుడైనా, ఎక్కడినుంచైనా సులభంగా పొందగలగా వచ్చునని కేడీసీసీ బ్యాంక్‌ను ఆధునికీకరించి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉన్నామని చైర్మన్ నెట్టెం రఘురాం స్పష్టం చేశారు.



# ఏపీలో పదో తరగతి ఫలితాలు నేడే విడుదల...

ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు గుడ్‌న్యూస్. టెన్త్ ఫలితాల విడుదలపై అధికారిక ప్రకటన వచ్చేసింది.. గురువారం ఉదయం 11 గంటలకు ఫలితాలను విడుదల చేయబోతున్నట్లు మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. టెన్త్ విద్యార్థులకు మంత్రి కొన్ని సూచనలు చేశారు.. పదో తరగతి ఫలితాలు ఏపీ ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ ద్వారా, మనమిత్ర వాట్సాప్, లీప్ యాప్, డిజిలాకర్ యాప్‌తో పాటుగా వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చున్నారు. టెన్త్ ఫలితాలను విడుదల చేసిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా హెడ్‌మాస్టర్లు ఫలితాలను స్కూల్ లాగిన్స్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులకు ముందుగానే శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేష్.. 'లక్ష్యాలను సాధించిన వారికి అభినందనలు.. లక్ష్యాన్ని చేరుకోలేని వారు, ఇది కేవలం ఒక మైలురాయి మాత్రమేనని గమనించాలన్నారు.. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి' అన్నారు.

## పెట్రోల్, డీజిల్ కొరత... ఆ వదంతులు వ్యాప్తిచేస్తే కఠిన చర్యలు



అయ్యన్నపేట (చైతన్యరథం): జిల్లాలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, పెట్రోల్, డీజిల్పై తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని విజయనగరం గ్రామీణ సీఐ బి. లక్ష్మణరావు హెచ్చరించారు. బుధవారం సర్కిల్ పరిధిలోని పలు బంకుల్లో తనిఖీలు చేశారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని బంకుల నిర్వాహకులకు సూచించారు. బాటిళ్లలో పెట్రోల్ తీసుకోవడంపై నిషేధం ఉంది. ఈ నేపథ్యంలో ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో బాటిళ్లతో వస్తే వారి పూర్తి వివరాలను సేకరించాలని సిబ్బందికి సూచించారు. కేవలం అత్యవసరమైతే తప్ప బాటిళ్లలో ఇంధనం పోయరాదన్నారు. ప్రస్తుతం అన్ని బంకుల్లోనూ పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. పెట్రోల్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎస్సై అశోక్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

## అంబరాన్నంటిన సిరిమాను సంబరాలు... పోటెత్తిన జనం



బొబ్బిలి (చైతన్యరథం): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, బొబ్బిలి ప్రాంత వాసుల ఇలవేల్పులగా విరాజిల్లుతోన్న గొల్లపల్లి, దాడితల్లి, పాతబొబ్బిలి సరేపోలమ్మ సిరిమానోత్సవాలు మంగళవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. పట్టణంలో ఒకే సమయానికి రెండు సిరిమానులు ఊరేగడంతో భక్తులు ఆసక్తిగా తిలకించారు. అటు గొల్లపల్లి, ఇటు పాతబొబ్బిలి పురవీధుల్లో సిరిమానోత్సవాలు ఊరేగాక పట్టణానికి చేరుకున్నాయి. దారిపొడవునా భక్తులు నీరాజనం పట్టారు. సిరిమాను వద్ద మొక్కులు, ముడుపులు చెల్లించి చల్లగా దీవించాలని అమ్మవార్లను వేడుకున్నారు. సిరిమానోత్సవానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మాజీ మంత్రి, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ అధ్యక్షుడు సుజయకృష్ణ రంగారావు, ఎమ్మెల్యే బేబినాయన, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైకాపా నాయకులు సిరమ్మ, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలతోపాటు ఒడిశా రాష్ట్రం నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## నర్సీపట్నంలో 108 అడుగుల శివపార్వతుల... విగ్రహాలు



అనకాపల్లి (చైతన్యరథం): జిల్లాలోని నర్సీపట్నం త్వరలోనే ఒక కొత్త పర్యాటక ఆకర్షణగా మారబోతోంది. సృష్టి క్షేత్రం పేరుతో 108 అడుగుల ఎత్తైన శివపార్వతుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా నర్సీపట్నాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో భారీ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా పట్టణంలోని పెద్ద చెరువును హైదరాబాద్ ట్యాంక్‌బండ్ తరహాలో అందంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఇటీవల ఆర్ అండ్ బి అధికారులతో కలిసి పనులను పరిశీలించిన స్పీకర్, గతంలో ప్రభుత్వం మార్పుతో ఆగిపోయిన అభివృద్ధి పనులను మళ్లీ ప్రారంభిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో చర్చించి, రోడ్డు అభివృద్ధి కోసం 3 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరు చేయించామని వెల్లడించారు.

## స్వచ్ఛరథాన్ని సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే కిమిడి



చీపురుపల్లి (చైతన్యరథం): స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆయన స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. స్వచ్ఛరథం వద్ద పనికిరాని ప్లాస్టిక్, సీసాలు, పాత పేపర్లు, ఎలక్ట్రానిక్ వ్యర్థ పదార్థాలు ఇస్తే వాటి బరువుకు తగ్గట్టుగా సరుకులను పొందవచ్చని చెప్పారు. అనంతరం చెత్తల సేకరణ రిక్షాలు, ప్లాస్టిక్ డబ్బాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు, పార్టీ నాయకుడు కోట్ల మోతీలాల్‌నాయుడు, ఏఎంసీ చైర్మన్ తాడ్డి చంద్రశేఖర్(చందు), పార్టీ మండల కార్యదర్శి కె.ధనంజయ, జనసేన పార్టీ మండల అధ్యక్షురాలు రౌతు కృష్ణవేణి, బీజేపీ మండల అధ్యక్షుడు సరిది రామునాయుడు, ఎంపీడీవో, తహసీల్దార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాదర్బార్‌కు 43 వినతులు**

మెరకముడిదాం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై 43 వినతులు వచ్చాయి. వీటిని పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# ప్రతి ప్రాంతంలో అభివృద్ధి వేగవంతం : ఎమ్మెల్యే నసీర్

- ఆర్థిక సంఘ నిధులతో డ్రెయిన్ల నిర్మాణం
- సీతానగర్ లో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



గుంటూరు (చైతన్యరథం): నగరంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి వేగవంతం చేస్తున్నామని, ప్రధాన రహదారులను సైతం తీర్చిదిద్దుతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం స్థానిక సీతానగర్ లో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.2 కోట్లతో డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అంతర్గత రహదారులు, డ్రెయిన్ల నిర్మాణంతోపాటు మెయిన్ ప్రాంతాల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మణిపురం బ్రిడ్జి నుంచి మారుతీ షోరూమ్ వరకు డ్రెయిన్ నిర్మాణం చేపట్టామని చెప్పారు. రైల్వే అధికారులు నెహ్రూనగర్ నుంచి మోతీలాల్ నగర్ మీదుగా రామిరెడ్డి తోట వరకు చేపట్టిన డ్రెయిన్ ఇక్కడ కలుస్తుందని అన్నారు. గత పదేళ్లుగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధికి దూరమైన అన్ని ప్రాంతాలను ప్రగతి పథంలోకి తీసుకెళుతున్నామని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో అక్కడక్కడా ఇబ్బందులు వచ్చినా తాత్కాలికమేనని స్పష్టం చేశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. ఇటు అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందిస్తున్నామని తెలిపారు. యువత భవిత కోసం రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయలతో పెట్టుబడులు తీసుకొస్తున్నామని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలను ఎల్లప్పుడూ తాము అందుబాటులో ఉంటామన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు పనితీరుపై ప్రజల ప్రశంసలు



కొత్తపేట (చైతన్యరథం): ఏపీలో ఒక జిల్లా ఉంది... అక్కడ ప్రజలు మాత్రమే కాదు, నాయకులు సైతం ఒక ఎమ్మెల్యేను చూసి గర్వపడుతున్నారు. మా మంచి ఎమ్మెల్యే అని ప్రేమతో పిలుచుకుంటూ, ఆయన మా ఇంటి బిడ్డ అని పెద్దలు చెప్పుకుంటుంటే.. యువత మాత్రం ఏ సమస్య వచ్చినా మా సార్ ఉన్నారు అంటూ ధైర్యంగా ముందుకు సాగుతున్నారు. ఈ ప్రేమ, ఈ నమ్మకం ఒక్క రోజులో రాలేదు.. ఆయన చూపిన వినయ విధేయత, సేవా తత్వమే ఆ స్థాయికి తీసుకెళ్లింది. గోదావరి జిల్లాలంటేనే ఆప్యాయతకు, అనురాగాలకు ప్రతీక. అలాంటి అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిచిన బండారు సత్యానందరావు తెలుగుదేశం పార్టీ తరపున ప్రజలకు సేవలందిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనకు రాజకీయ హోదా ఎంత ఉన్నా.. ప్రవర్తన మాత్రం సాధారణ మనిషిలానే ఉంటుంది. నియోజకవర్గంలో జరిగే ప్రతి చిన్న పెద్ద కార్యక్రమానికి ఆయన హాజరవుతారు. శుభకార్యాలు, కష్టసమయాలు.. ఏ సందర్భమైనా సమాచారం ఇస్తే చాలు, ఆ కుటుంబ సభ్యుడిలా అక్కడికి చేరుకుంటారు. సమస్య అయితే నేనున్నాను అంటూ భరోసా ఇచ్చి, ఆ కుటుంబానికి కొండంత అండగా నిలుస్తారు.

# ఫిటెనెస్ పరీక్షలతో మరింత మెరుగ్గా రోడ్డు భద్రత : మంత్రి మండిపల్లి



ఏలూరు (చైతన్యరథం): ఏలూరు శివారులోని పాత కలపర్రు టోల్ గేట్ వద్ద పద్మోవా ఆటోటెక్ సర్వీసెస్ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్(ఏటీఎస్)ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాహనాల ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించడం ద్వారా రోడ్డు భద్రత మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడంలో ఇలాంటి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ షేక్ కరీం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో ఎండలు, వర్షాలతో విభిన్న వాతావరణం

- 10 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీస్తాయని హెచ్చరిక
- విశాఖ, అనకాపల్లి సహా పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు
- నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- వడదెబ్బ, పిడుగుల బారిన పడకుండా జాగ్రత్తలు అవసరం



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు ఎండలు మండిపోతుండగా, మరోవైపు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలో రానున్న 24 గంటల్లో కొన్ని జిల్లాల్లో తీవ్ర వడగాల్పులు, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. వివరాల్లోకి వెళితే, బుధవారం నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో రాష్ట్రంలోనే అత్యధికంగా 44.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని 10 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 20 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది. మరోవైపు ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కూడా నమోదవుతున్నాయి. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే, రాయలసీమ, ఉత్తరాంధ్రలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడవచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల సంస్థ సూచించింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్నప్పుడు రైతులు, పశువుల కాపరులు చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని హెచ్చరించింది. అదేవిధంగా, ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి మరియు కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఎండల ఉధృతి ఎక్కువగా ఉంది. శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో ఉష్ణోగ్రత 45.4 డిగ్రీల వరకు నమోదైంది.

# టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్ ప్రయాణం పార్టీకి కొత్త ఊపు : ఎంపీ సానా సతీష్‌బాబు



కాకినాడ / అమరావతి (చైతన్యరథం): గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నూతన కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు జాతీయ ఉపాధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేశారు. అదే సమయంలో మంత్రి నారా లోకేష్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా (వర్కింగ్ ప్రెసిడెంట్‌గా) బాధ్యతలు స్వీకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్‌ను రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ ప్రముఖులు, నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో నారా లోకేష్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రమాణ స్వీకారం చేయడం పార్టీకి నూతన ఉత్సాహాన్ని నింపిందని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు అభిప్రాయపడ్డారు. అలాగే జాతీయ ఉపాధ్యక్షుడిగా ప్రమాణం చేసి రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. పార్టీ అభివృద్ధి, ప్రజా సేవలో మరింత కృషి చేస్తానని, నాయకత్వం సూచించిన దిశానిర్దేశాలను పాటిస్తూ ముందుకు సాగుతానని ఆయన స్పష్టం చేశారు.

# భీమవరంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



భీమవరం (చైతన్యరథం): నర్సాపురం పార్లమెంటరీ పరిధి భీమవరం నియోజకవర్గం భీమవరం మండలంలోని ఫోకస్ బూత్ 20, 168, 174ల్లో సుమారు 15 కుటుంబాలు వైసీపీని వీడాయి. వారంతా భీమవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మండల అధ్యక్షుడు, ఫోకస్ బూత్ అబ్జర్వర్ సమక్షంలో టీడీపీ తీర్థం తీసుకున్నారు.

# రాష్ట్ర అధికార ప్రతినిధిగా దాసరి శ్యామ్ చంద్రశేషు ప్రమాణస్వీకారం



చింతలపూడి (చైతన్యరథం): పార్టీ విధానాలను ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువయ్యే విధంగా నా వంతు కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు వ్యాఖ్యానించారు. తెలుగుదేశంపార్టీ జాతీయ, రాష్ట్ర కార్యవర్గసభ్యుల ప్రమాణస్వీకారం కార్యక్రమం బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ ప్రమాణస్వీకారం చేయగా ఆయనతో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నేతలు కూడా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గం నుండి రాష్ట్ర అధికార ప్రతినిధిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన ఉన్నత విద్యావంతులు దాసరి శ్యామ్ చంద్రశేషు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్సీ సామాజికవర్గానికి చెందిన గతంలో టీడీపీ టికెట్ ఆశించిన బొమ్మాజీ అనిల్ ప్రమాణస్వీకారం చేశారు. ఈసందర్భంగా తనపై ఇంత నమ్మకం ఉంచి మరోసారి ఇంతటి అవకాశం కల్పించిన జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌లకు శేషు ధన్యవాదాలు తెలిపారు.

# ఉత్తరాంధ్రకు తాగు, సాగు నీటి సమస్య లేకుండా చేస్తాం

కాకినాడ (చైతన్యరథం): ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చడంలో గోదావరి జలాలు ఎంతో కీలకమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించేందుకు పోలవరం ఎడమ కాలువే ప్రధాన ఆధారమన్నారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి సమస్య లేకుండా గోదావరి జలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కాకినాడ జిల్లా అన్నవరంలో పంపా ఆక్విడక్ట్ వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను మంత్రి నిమ్మల పరిశీలించారు. ఆరెంపూడి, గవరయ్య కోనేరు గ్రామాల దగ్గర హైవే క్రాసింగ్ వంతెనల నిర్మాణ పనులనూ మంత్రి నిమ్మల పర్యవేక్షించారు. అనంతరం తుని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో పోలవరం ఎల్ఎంసీ పనుల పురోగతిపై అధికారులు, ఏజెన్సీలతో సమీక్ష నిర్వహించారు.

## కూలిన వంతెన... రాకపోకలకు తీవ్ర అంతరాయం

వినుకొండ (చైతన్యరథం): పల్నాడు జిల్లా నుజెండ్ల మండలం తలార్లపల్లి సమీపంలోని ఓబనపాలెం వద్ద వంతెన కూలిపోయింది. దీంతో అపాపురం, తలార్లపల్లి, అద్దంకి, గొల్లపాలెం, పువ్వాడ, కొత్తపాలెం, కొండల రాయునిపాలెం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం మీదుగా అద్దంకి వెళ్లే బస్సులు కూడా ఇదే మార్గంలో వెళ్లాల్సి ఉండటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

## కూలిన వంతెన...తక్షణమే స్పందించిన ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు

**●గంటల వ్యవధిలోనే ప్రత్యాయ మార్గం ఏర్పాటు**

**●10 రోజుల్లో బ్రిడ్జికి మరమ్మత్తులు చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు**



వినుకొండ (చైతన్యరథం): పల్నాడు జిల్లా నూజెండ్ల మండలంలోని తలార్లపల్లి సమీపంలో వంతెన కూలి రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిన వేళ, ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మెరుపు వేగంతో స్పందించి సమస్యకు తక్షణ పరిష్కారం చూపించారు. గంటల వ్యవధిలో ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఓబనపాలెం వద్ద వంతెన బలహీనపడి కూలిపోవడంతో వినుకొండ నుంచి కొండరాయునిపాలెం వెళ్లే ప్రధాన రహదారి తెగిపోయి అపాపురం, తలార్లపల్లి, అద్దంకి, గొల్లపాలెం, పువ్వాడ, కొత్తపాలెం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలిసిన వెంటనే జీవీ ఆంజనేయులు R&B అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించగా, అధికారులు R&B DE Madhavarao,AE Navya యుద్ధప్రాతిపదికన జెసిబి సహాయంతో సైడ్ డైవర్షన్ రహదారిని గంటల్లోనే ఏర్పాటు చేసి రవాణాను పునరుద్ధరించారు. ప్రస్తుతం పరిస్థితి సాధారణంగా మారగా, వంతెన మరమ్మత్తు పనులను వారం రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రజల ఇబ్బందులను వెంటనే గుర్తించి పరిష్కారం చూపిన జీవీ ఆంజనేయులు చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు సూచనల మేరకు వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళీ కృష్ణ యాదవ్ కూలిన వంతెనను పరిశీలించి, ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేసే వరకు పర్యవేక్షించారు. కుంట కోటిరెడ్డి కిష్టం నాగమల్లేశ్వరరావు బైలడుగు తులసీరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నున్న గ్రామంలో వైభవంగా శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన

**●ముఖ్య అతిథిగా హాజరై ఆలయ పునర్నిర్మాణానికి పునాది రాయి వేసిన విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**



గన్నవరం (చైతన్యరథం): విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో వెలసిన ప్రాచీన, చారిత్రక ప్రాధాన్యత కలిగిన శ్రీశ్రీశ్రీ కాశీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు బుధవారం వైభవంగా శంకుస్థాపన జరిగింది. శ్రీ పరాభవ నామ సంవత్సర వైశాఖ శుద్ధ త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని, హస్త నక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కరాంశ ముహూర్తంలో పునాది రాయి వేశారు. ఈ కార్యక్రమం శ్రీమన్ మునీంద్ర మహారాజ్ సారధ్యంలో డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్ పర్యవేక్షణలో శైవ ఆగమ నియమాల ప్రకారం నిర్వహించబడింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డకు వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, వాస్తు హోమం వంటి పూజా కార్యక్రమాలు వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ ఆలయాన్ని పునర్నిర్మించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఆలయాన్ని ఆగమశాస్త్రం ప్రకారం శిల్పకళా సౌందర్యంతో అభివృద్ధి చేసి, భక్తులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నున్న గ్రామ టీడీపీ అధ్యక్షులు కలతోటి శ్రీనివాసరెడ్డి, గంపా శ్రీనివాస్, యార్కారెడ్డి కోటిరెడ్డి, పామర్తి శ్రీనివాసరావు, బాలశేఖర రెడ్డి, పోలారెడ్డి సాంబిరెడ్డి, బొకినాల తిరుపతిరావు, గోవింద నాగబాబు, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నారా లోకేశ్ ప్రజల మనసులు గెలిచిన పోరాట యోధుడు

**● పసుపు దళం గర్వించే తిరుగులేని సైనికుడు నారా లోకేశ్ : ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): "తెలుగువారి ఆత్మగౌరవం, ఆవేశం, ఆలోచన నుంచి పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ. అటువంటి పార్టీకి నేడు మూడోతరం నాయకత్వంలో రాజకీయ ప్రస్థానం కొనసాగించడం.... దేశ రాజకీయ చరిత్రలో ఒక సువర్ణాధ్యయనానికి నాంది పలికిందనే చెప్పాలి. నారా లోకేశ్.. ఇది కేవలం పేరు కాదు.. రాష్ట్ర రాజకీయాల్లో వినూత్న పాలనా సంస్కరణలకు బీజం వేసిన స్ఫూర్తి. ప్రజా సంక్షేమానికి సరికొత్త భాష్యం చెప్పిన తెలుగుదేశం కీర్తి. నారా లోకేశ్ కేవలం నాయకుడే కాదు.. ప్రజల మనసులు గెలిచిన పోరాట యోధుడు, పార్టీ సైన్యం గర్వించే పసుపు సైనికుడు. తాత స్వర్గీయ ఎన్టీఆర్ స్ఫూర్తితో.. తండ్రి చంద్రబాబునాయుడి దూరదృష్టితో నవనాయకుడు లోకేశ్ యువశక్తి కలవడంతో తెలుగుదేశం పార్టీకి ఒక కొత్త యుగం ప్రారంభమైందనే చెప్పాలి. లోకేశ్ నాయకత్వం కేవలం పార్టీకే కాదు.. ప్రజల భవిష్యత్తుకు, రాష్ట్ర ప్రగతికి సరికొత్త వెలుగుమార్గం కానుంది. లోకేశ్ రాజకీయ ఆరంగేట్రమే సంచలనం.. ప్రజలకోసం.. వారికి ఉజ్వల భవిష్యత్ అందించాలన్న గొప్ప సదాశయంతోనే ఆయన తెలుగుదేశం కుటుంబంలోకి ప్రవేశించారు. స్వర్గీయ ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబుల వారసత్వస్ఫూర్తితో పాటు.. గొప్ప రాజకీయ నాయకత్వ లక్షణాలు ఇప్పుడు లోకేశ్ లో ప్రతిబింబిస్తున్నాయి. ఆ లక్షణాలే ఆయనకు నేడు పార్టీ సారథ్య బాధ్యతలు అప్పగించాయి. తెలుగుదేశం కొత్త శకం ఆరంభానికి, కొత్త తరానికి లోకేశ్ వారధిగా నిలుస్తారు అనడం ఎంతమాత్రం అతిశయోక్తికాదు. పార్టీలో, ప్రభుత్వంలో తనకు అప్పగించిన బాధ్యతల్ని త్రికరణ శుద్ధిగా నెరవేర్చిన ఘనత లోకేశ్‌ది. రాజకీయ వారసులమని చెప్పుకునే ఎందరో అవకాశవాదులు, అవినీతిపరులు, హత్యా రాజకీయ నాయకులు లోకేశ్ స్వశక్తిని, నాయకత్వ లక్షణాలను చూసి నిజంగా సిగ్గుపడాలి. కష్టసుఖాల్లో కార్యకర్తలకు చేదోడుగా నిలవడంలో లోకేశ్ చూపిన పనితీరు.. ఆలోచనా విధానం ఆయన్ని తమ భావి నాయకుడిగా నిలబెట్టింది. తాను చేపట్టిన నూతన బాధ్యతలకు లోకేశ్ నూటికి వెయ్యిశాతం న్యాయం చేస్తారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. పసుపు సైన్యాన్ని పౌరుషంతో ముందుకు నడిపించే లోకేశ్ నవయువ సారథ్యం.. పార్టీని, రాష్ట్రాన్ని కొత్త విజయతీరాలకు, సరికొత్త గమ్యస్థానాలకు చేర్చబోతోంది అని చెప్పడానికి గర్విస్తున్నాను." అని శాసనసభ్యులు, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

## పేద ప్రజలకు సీ.ఎం.ఆర్.ఎఫ్ ఒక వరం : వై.వి.బి రాజేంద్రప్రసాద్



విజయవాడ (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కాగిత కొండ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4,00,000 లక్షలు సీఎంని అడిగి తీసుకువచ్చి కొండ కుటుంబానికి అందించారు రాజేంద్రప్రసాద్, బోడె ప్రసాద్, వీరంకి గురుమూర్తి. రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు కాగిత కొండ ఇటీవల అనారోగ్యానికి గురై విజయవాడ రమేష్ హాస్పటల్లో ట్రీట్మెంట్ తీసుకొని తదుపరి ఉయ్యూరు హోప్ హాస్పటల్లో జాయిన్ అయి ఐసీయూలో వైద్యం చేయించుకుంటున్నందున ఆయనను పరామర్శించి, అతని ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్ జాన్ డేవిడ్ అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ముందుగా విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ అనారోగ్యంతో ఎవరైనా సరే వైద్యం చేయించుకున్న పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా, ఎల్‌వోసిల ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వారికి డబ్బులు ఇచ్చి ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా నారా చంద్రబాబునాయుడు చూస్తున్నారని అన్నారు.

## మాచర్లను రౌడీయిజానికి అడ్డాగా మార్చిన పిన్నెల్లి బ్రదర్స్

**● ఆగ్రహం వ్యక్తం చేసిన ఏసీ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్**



మాచర్ల (చైతన్యరథం): పల్నాడు జిల్లా టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏపీ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రెంటచింతల మండలం పశర్లపాడు తిరుణాళ్ల సందర్భంగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిపై దాడికి పాల్పడిన షేక్ సైదా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరుడని, సైదా తండ్రి గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరుపున రిగ్గింగ్‌కి పాల్పడే ప్రయత్నం చేశారని, పోలీసులు అడ్డుకున్న సంగతిని పిన్నెల్లి మరిచిపోయి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం టీడీపీ నేతలు చేస్తున్న అభివృద్ధిపై చర్చించడం కంటే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఏడు నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలతో అంతర్గతంగా మాట్లాడుకోవడం మంచిదన్నారు. గత ప్రభుత్వంలో హత్యలు, దౌర్జన్యాలు, ఆస్తుల ఆక్రమణలు ఎవరూ ఎక్కువ చేశారనే వ్యవహారంపై ర్యాంక్‌లు కేటాయించుకోవాలని ఎద్దేవా చేశారు. గత 20 ఏళ్ల పాటు అధికారాన్ని అడ్డుపెట్టుకొని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రతి గ్రామంలో రౌడీలు, గూండాలను అభివృద్ధి చేశారన్నారు. విగ్రహాల దొంగతనం నుంచి అక్రమ మద్యం, అక్రమ మట్టి మాఫియా తదితర అవినీతి కార్యక్రమాలకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్పడ్డాని విమర్శించారు.

## లోకేష్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన మంత్రి లోకేష్‌కి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన లోకేష్‌కి అభినందనలు తెలియజేసిన ఎమ్మెల్యే, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. యువ నాయకత్వం ద్వారా పార్టీకి నూతన ఉత్సాహం వచ్చి, రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలలో ఉత్తేజం పెరుగుతుందని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన పార్టీ కార్యవర్గానికి కూడా అభినందనలు తెలియజేసిన భాష్యం ప్రవీణ్... పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యవర్గం కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం లక్ష్యంగా పార్టీ మరింత శక్తివంతంగా ముందుకు సాగుతుందని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తే తెలుగుదేశం పార్టీ మరిన్ని విజయాలు సాధిస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



మార్కాపురం (చైతన్యరథం): ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి సతీమణి వసంత లక్ష్మి మార్కాపురం పట్టణం, మార్కాపురం మండలంలోని 13 మందికి స్వయంగా వారి ఇంటికి వెళ్లి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న వారిలో మార్కాపురం టౌను మార్కాపురం మండలానికి చెందిన తిరుమలరెడ్డి వెంకటేశ్వర రెడ్డి రూ. 4,09,237, సయ్యద్ హసీనా 30,500, షేక్ మాబున్ని 31,278, నూనె వెంకట సత్య శివారెడ్డి 43,077, బొందిలి రామ్ ప్రసాద్ సింగి 25,437, గోగిరెడ్డి సత్యనారాయణ రెడ్డి 25,437, కంచర్ల కిరణి 40,000, పిట్టు హేమలత 31,544, గణపం రామలింగారెడ్డి 38,795, తడికమండ్ల వెంకటేశ్వర్లు 26,434, ఏరువా రామిరెడ్డి 19,000, గోలమారు రంగారెడ్డి (బోడిచెర్ల) 48,376, నారు వెంకటేశ్వర రెడ్డి (తూర్పుపల్లె, గజ్జలకొండ) 43,824 రూపాయలు ఉన్నారు.



## ఉభయ నాంచారులతో శ్రీవారి ఊంజల సేవ

తిరుపతి, (చైతన్యరథం): తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవంలో మొదటిరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి విశ్వరూప దర్శనం కల్పించారు. అనంతరం శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలోని బుగ్గ వద్దకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని వేంచేపు చేశారు. మధ్యాహ్నం 2:30 నుంచి 4:30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సమర్పణ, ఆస్థానం నిర్వహించారు. సాయంత్రం శ్రీ మహలక్ష్మి అమ్మవారి మండపంలో ఉభయనాంచారులతో కలసి శ్రీవారి ఊంజల్సేవ, ఆస్థానం, అనంతరం బుగ్గ వద్ద ఊరేగి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

## పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

తిరువానూరు (చైతన్యరథం): తిరువానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీమ్చరీర్ధం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంద ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. మే 2వ తేదీ వరకు వసంతోత్సవాలు జరుగుతాయి.



## దివ్యాంగులకు మోటారు సైకిళ్ల పంపిణీ

కడప పట్టణంలో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంస్థ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి చైర్మన్ గడుపూటి నారాయణస్వామి చేతుల మీదుగా దివ్యాంగులకు 70 ఉచిత మోటార్ సైకిళ్ల పంపిణీ జరిగింది. నేడు కడప కలెక్టర్ గారి కార్యాలయంలో 70 మంది దివ్యాంగుల లబ్ధిదారులకు ఉచితంగా మూడు చక్రాల స్కూటీ వాహనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గడుపూటి నారాయణస్వామి, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ హాజరయ్యారు. కడప జిల్లా ఏడి కిషోర్ , రాష్ట్ర అధ్యక్షులు చిన్న సుబ్బయ్య యాదవ్, కడప జిల్లా టీడీపీ విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు మురళి యాదవ్, ప్రధాన కార్యద చెంద్రాయుడు, విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అధికార ప్రతినిధి దాది శ్రీను, శేఖర్, బారా హుస్సేన్, లబ్ధిదారులు, అధికారులు, పాల్గొన్నారు.



టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్‌ను ఆయన నివాసంలో ఉయ్యూరు మండలం బొల్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గ్రామపార్టీ కార్యదర్శి, ధర్మవరపు రంగారావు, క్లస్టర్ ఇన్చార్జి సాంబశివరావు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

# అసూయాద్వేషాల పెంటకుప్ప వైసీపీ

## - వైసీపీ సోషల్ మీడియాపై, విరుచుకుపడ్డ తెలుగు తమ్ముళ్లు

కావలి (చైతన్యరథం): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడుగుజాడల్లో కావలి పట్టణంలో అభివృద్ధి ప్రదాత కావ్య కృష్ణారెడ్డి పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి, జిల్లా అధికార యంత్రాంగం తీసుకున్న చొరవతో 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగింపు జరగటం వంటి అంశాలను జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడటం వారి అవివేకం అని తెలుగు తమ్ముళ్లు విరుచుకుపడ్డారు. బుధవారం కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాలతో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. దీనిపై వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అర్థం లేని మాటలతో విమర్శలు చేశారని వాటిని ఖండించారు. ఎన్నో సంవత్సరాలుగా నిషేధిత భూముల జాబితాలో ఉన్న రెండువేల కుటుంబాలకు చెందిన 109 ఎకరాల 70 సెంట్లు రిజిస్ట్రేషన్లు కాబోతున్నాయన్నారు. వాటికి విముక్తి కలిగించిన కలెక్టర్ హిమాన్స్ శుక్లా, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తదితర అధికారులకు ప్రజలు సన్మానిస్తే చూసి ఓర్చుకోలేని గుణం కలిగిన వైసీపీ నేతలు ఇష్టానుసారంగా విమర్శలు చేశారు అన్నారు. వైసీపీ కాలంలో చేపట్టిన 22ఏ నిషేధిత జాబితా ఇప్పుడు విడదల చేసినదే, అది మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి చలవ అనడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. ఇదే అని వక్రీకరించి విమర్శలు చేయటం తగదన్నారు. ఆనాడు మీరు నిషేధిత జాబితా నుంచి తొలగించి ఉంటే ఎంత మంది భూములు, నివాస స్థలాలు రిజిస్ట్రేషన్లు జరిగాయో తెలియచేయాలన్నారు. మీ కాలంలో మీకు నచ్చిన వారివి అక్కడ కొన్ని సర్వే నంబర్లు తీసుకొని వారికి మాత్రమే న్యాయం చేశారే తప్ప వెంగళరావు నగర్ ప్రాంత వాసులకు మీరు చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. జిల్లా అధికారులు పెద్ద మనసు చేసుకొని కావలికి మేలు చేశారన్నారు. భూమిపైన అనుభవం కలిగిన స్థానిక ఎమ్మెల్యే సూచనలతో అధికారులు మంచి మనసు చేసుకొని 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి విముక్తి కలిగించారనడం, ప్రతి ఒక్కరూ అంగీకరించి అభినందిస్తుంటే మీకు మాత్రం అది మంచి అనిపించలేదా అని విమర్శలు చేశారు. మీరు చేస్తున్న విమర్శలను బట్టి అర్థమవుతుందన్నారు.

నేడు ప్రజలు అమాయకులు కాదని, ప్రతి ఒక్కటి గమనిస్తున్నారని, మీరు చెప్పేవి ఏమీ నమ్మరని గుర్తించుకోవాలన్నారు. తద్వారా మీరే నవ్వుల పాలు కాక తప్పదు అన్నారు.

మీరు ఎన్ని చేసినా, బొంకినా కావలి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కావలి కనకపట్నం కాబోతుందని వ్రాసి పెట్టుకోవాలన్నారు. అంతేకానీ అసూయ పడడం మానుకోవాలి అన్నారు. మీరు ఇలాగే విమర్శలు చేస్తూ పోతే మరో 15 సంవత్సరాలు మీకు అధికారం దక్కదు అని, మీ ఆశలు అడియాసలు కాక తప్పదు అన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని పార్టీలు కలిసి అభివృద్ధి ప్రదాత చంద్రబాబు నాయుడు పాలనలో విజయవంతంగా రాష్ట్రం ముందుకు పోతుందని, అలాగే కావలి అభివృద్ధి కావ్య కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శరవేగంగా ముందుకు పోతూ కనకపట్నం కాబోతుందన్నారు. పిచ్చోడికి మొగిలి పువ్వు ఇస్తే ఎక్కడో పెట్టుకున్నాడన్న చందంగా, మీకిచ్చిన మొగిలి పువ్వును ఎక్కడ పెట్టుకున్నారో.. మీకే తెలియలేదని ఎద్దేవా చేశారు. పథకాల పేర్లు పెట్టుకునే నైజం చంద్రబాబు నాయుడుకి లేదని, అలాగ పెట్టుకునే పని అయితే ప్రతి ఒక్కటి నేడు కొనసాగే పథకాలు అన్ని కూడా ఎన్టీఆర్ పేరు మీదనే ఉండేవన్నారు. పెన్షన్లు, రెండు రూపాయల కేజీ బియ్యం, తదితర ఎన్నో పథకాలు ఎన్టీఆర్ పేరు మీద ఉండేవన్నారు. అవి కాలక్రమేనాణా పార్టీలు మారుతూ పేర్లు ఎందుకు పెట్టుకున్నారని విమర్శించారు. ప్రెస్ మీట్ పెట్టేటప్పుడు వివరాలు కొంత తెలుసుకుంటే వినటానికి బాగుంటుందే తప్ప, ఇష్టానుసారంగా నోటికొచ్చినట్లు మాట్లాడి, మీ పార్టీ పరువు తీసే నాయకులుగా మిగిలిపోవద్దని హితవు పలికారు. సీఎం చంద్రబాబు నాయుడు ఒక విజనరీ అని, ఆయన అడుగుజాడల్లో కావలి ఎమ్మెల్యే ఒక అద్భుతమైన రీతిలో కావలిని తీర్చిదిద్దడానికి కంకణం కట్టుకొని స్థానికంగా ప్రజలతో నిత్యం మమేకం అవుతూ కొనసాగుతున్న ఏకైక ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అని ప్రతి ఒక్కరు గుర్తించుకొని, ఆయనను అభినందించాలే తప్ప, విమర్శించడం మీ అవివేకానికి నిదర్శనం అన్నారు. పెట్రోలు డీజిల్ అనే అంశాలు, కూరగాయలు, టమోటాలు ఇలా అందరికీ తెలిసిన అంశాలే వాటిపై వైసీపీ ప్రెస్ మీట్ లో విమర్శలు కాదు కానీ, డెవలప్మెంట్ గురించి మీ కాలంలో ఎలా ఉంది, నేడు కూటమి ప్రభుత్వ కాలంలో ఎలా ఉందో పరిశీలించి మాట్లాడాలన్నారు. చంద్రబాబు నాయుడు వల్లే ప్రపంచంలో అమెరికా తరువాత ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి పథంలో నిలుస్తుందన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కావలి ఒక గోల్డెన్ సిటీగా తీర్చిదిద్దడానికి కావ్య కృష్ణారెడ్డి అడుగులు వేస్తున్నాడని ఈ అభివృద్ధిని చూడలేక అసూయ పడటం మానుకోవాలన్నారు.



# ఇరిగేషన్ పనులు ఆగిపోవడానికి జగనే కారణం

**కాంట్రాక్టర్లు ఇచ్చే కాసుల కోసర్ కక్కుర్తిపడి ద్రోహం చేశాడు, కేసీఆర్, జగన్ కుమ్మక్కై చేసిన కుట్ర హరీష్ రావు మాటల్లోనే తేలింది. ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, పల్లె సింధూరరెడ్డి, పరిటాల శ్రీరామ్ ధ్వజం**



పుట్టపర్తి, జగన్మోహన్ రెడ్డి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పనులను కాంట్రాక్టర్లు ఇచ్చే కాసుల కోసం కక్కుర్తిపడి పనులు మొదలుపెట్టారని మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు మరియు శ్రీసత్యసాయిజిల్లా టీడీపీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు అన్నారు. పుట్టపర్తిలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఈరోజు నిర్వహించి విలేకరుల సమావేశంలో ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ....అవగాహన రాహిత్యంతో రాయలసీమ ప్రాజెక్టు విషయంలో రాయలసీమకు ద్రోహం చేశాడు. గ్రీన్ ట్రిబ్యునల్, కేంద్ర జలశక్తి, తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వకపోయినా జగన్ ప్రాజెక్టు పనులు ప్రారంభించాడు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో నాటకాలు ఆడిన వ్యక్తి జగన్. అనేక కేసులు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ కు వ్యతిరేకంగా కోర్టులో పడితే...వాటికి సరైన కౌంటర్లు కూడా జగన్ కోర్టుల్లో దాఖలు చేయకుండా గాలికి వదిలేశాడు. చంద్రబాబుగారి వల్ల రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆగిపోయిందని బురదజిమ్మే ప్రయత్నం చేస్తున్నాడు. రాయలసీమ ప్రజలకు అసత్యాలు చెప్పి నమ్మించాలని జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. రాయలసీమ ప్రజలు వైసీపీ నేతలు చెప్పే మాటలు నమ్ముతారని అనుకోవడం పూర్తిగా అవివేకమే. వైసీపీ ప్రభుత్వం హయాంలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం విషయంలో ఎందుకు ఈవిధంగా వ్యవహరించారో జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు ముఖ్యంగా రాయలసీమ ప్రజలకు సమాధానం చెప్పాలి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క తాగునీటి ప్రాజెక్టును అయినా సందర్శించాడా? రాయలసీమకు జీవనాడి అయిన హంద్రీనీవాకు ఎంత ఖర్చుపెట్టారు? దీనిద్వారా ఎన్ని చెరువులు నింపారు? ఎంత నీరు ఇచ్చారు? హంద్రీనీవాకు జగన్ పాలనలో ఖర్చుచేసింది కేవలం రూ. 2వేల కోట్లు. అంతేగాకుండా పనులను అసంపూర్తిగా వదిలేశారు. వైసీపీ ఐదేళ్లలో పోలవరం, హంద్రీనీవా, గాలేరు, పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టులకు జగన్మోహన్ రెడ్డి ఏం మేలు చేశాడో చర్చించే దమ్ము వైసీపీ నేతలకు ఉందా? ఒక్క ప్రాజెక్టు అయినా మేం పూర్తిచేశాం అని వైసీపీ నేతలు చెప్పుకోగలరా? పోలవరం ప్రాజెక్టు టీడీపీ హయాంలో 72శాతం పైబడి పూర్తయ్యిందనేది ఒక చరిత్ర. కానీ వైసీపీ నేతలు చరిత్రను చెరిపేయాలని ప్రయత్నాలు చేయడం అవివేకం. వైసీపీ నేతలు రౌండ్ టేబుల్ సమావేశాలు పెట్టి, చంద్రబాబుగారి గురించి కూటమి ప్రభుత్వం గురించి వ్యతిరేకంగా మాట్లాడేందుకు ఏమీ లేక వైసీపీ నేతలు తలలు బాదుకుంటున్న మాట వాస్తవం కాదా? రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ మీద హరీష్ రావు ప్రెస్ మీట్ లో చెప్పిన విషయాలు ఏవీ వైసీపీ నేతలకు కనిపించలేదా? వినిపించలేదా? కేసీఆర్ ఇంటికి వెళ్లి ఎక్కడపడితే అక్కడ సంతకాలు పెట్టి, ఇష్టమొచ్చినట్లు ప్రాజెక్టు పనులు చేసి నేడు ప్రజలను మోసం చేసిన మాట వాస్తవం కాదా జగన్మోహన్ రెడ్డి? బీసీలకు హక్కులు కల్పించింది ఒక్క తెలుగుదేశం పార్టీనే. ఈ దేశంలో బీసీలు, ఎస్సీలు, ఇతర సామాజికవర్గాలకు అత్యధిక శాతం న్యాయం చేసింది టీడీపీ. బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ఘనత ఒక్క టీడీపీకే సొంతం. కూటమి పాలనలో లేదా గత టీడీపీ పాలనలో బీసీలకు ఎక్కడ అన్యాయం జరిగింది? వైసీపీ పాలనలో నందం సుబ్బయ్య, అమర్నాథ్ గౌడ్, తోట చంద్రయ్య వంటి ఎందరో బీసీ అమాయకులను దారుణంగా చంపేస్తే అప్పుడు వైసీపీ నేతల గళాలు ఏమయ్యాయి? మూగబోయాయా? నేడు బీసీల గళం అని మాట్లాడే వైసీపీ నేతలకు ఆ హక్కు ఉందా? వైసీపీ పాలనలో ప్రాధాన్యత కలిగిన నామినేటెడ్ పదవులు, సలహాదారు పదవులు, గౌరవం దక్కే పదవులు దాదాపు వెయ్యి రెడ్డి సామాజికవర్గానికే కేటాయిస్తే నోరు మెదపని వైసీపీ నేతలు నేడు బీసీల గళం అని మాట్లాడడం దారుణం. వాల్మీకి, కురుబ, మాదిగ కార్పొరేషన్ పదవులు ఆయా సామాజికవర్గాలకు ఇవ్వాలి కాబట్టి ఇచ్చారు కానీ, ప్రాముఖ్యత కలిగిన పదవులు ఇచ్చారా? యూనివర్శిటీల్లో వీసీల పోస్టులు కూడా అత్యధికంగా రెడ్డి సామాజికవర్గాలకే జగన్ కట్టబెట్టలేదా? టీడీపీ తప్ప ఏ పార్టీ అధికారంలో ఉన్నా అన్యాయం జరిగిందే తప్ప న్యాయం జరగలేదన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన టీడీపీ కార్యవర్గం మొత్తానికి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్, నాయకులు ఉన్నారు.



# ధర్మవరం చరిత్ర, సంస్కృతి పుస్తకావిష్కరణ

**పాల్గొన్న టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్**

ధర్మవరం (చైతన్యరథం): ధర్మవరం చరిత్రను తెలియజేస్తూ.. విశ్రాంత అధ్యాపకుడు రచించిన ధర్మవరం చరిత్ర-సంస్కృతి పుస్తకాన్ని తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆవిష్కరించారు. ధర్మవరం పట్టణానికి చెందిన విశ్రాంత జూనియర్ లెక్చరర్ నరేష్ కుమార్ జయసుమన్ అనే కలం పేరుతో అనేక పుస్తకాలను రచించారు. ధర్మవరం పై ప్రేమ, ఇష్టంతో ఆయన 1500 సంవత్సరం నుంచి 2026 వరకు ఊరి చరిత్ర గురించి తెలియజేసేలా పుస్తకాన్ని రచించారు. ఇటీవల పుస్తక రచన పూర్తి కావడంతో ధర్మవరం లక్ష్మీచెన్నకేశవ స్వామి రథోత్సవం సందర్భంగా ఈ పుస్తకాన్ని శ్రీరామ్ ఆవిష్కరించారు. స్థానిక టీడీపీ నాయకులు, పట్టణంలోని ప్రముఖులతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించి..అందులో అంశాల గురించి అందరూ తెలుసుకోవాలనే శ్రీరామ్ స్వయంగా 100 పుస్తకాలు కొని పార్టీ నాయకులు, ప్రముఖులకు పంచిపెట్టారు. అనంతరం జయసుమన్ దంపతుల్ని ప్రత్యేకంగా అభినందించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరం ఒక సాధారణ పట్టణం కాదని.. ఈ ప్రాంతానికి ఒక బలమైన చరిత్ర ఉందన్నారు. ఇక్కడ ఉన్న ప్రతి స్థలం వెనుక ఒక ప్రత్యేకత ఉందన్నారు. దాదాపు 1500వ సంవత్సరం నుంచి అన్ని అంశాలు తెలుసుకుని పుస్తకాన్ని రచించడం సాధారణ విషయం కాదన్నారు. ఇందులో ధర్మవరం చరిత్ర మాత్రమే కాకుండా ఈ ప్రాంతంలో గతంలో ఏం జరిగింది.. ఇక్కడి సంస్కృతి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చేనేత వృత్తి ప్రాధాన్యతని, అలాగే గణతంత్ర రాజ్యాంగం ఏర్పడ్డప్పటినుంచి కూడా రాజకీయంగా ధర్మవరాన్ని ఎంత మంది నేతలు పాలించార ధర్మవరం ప్రజలు ఈ పుస్తకాన్ని చదివితే అనేక అంశాలు తెలుస్తాయని శ్రీరామ్ పేర్కొన్నారు.

# వైసీపీ నుంచి టీడీపీలో భారీ చేరికలు

**పసుపు కండువా కప్పుకున్న 100 కుటుంబాలు**

గుంతకల్ (చైతన్యరథం): గుంతకల్ మున్సిపాలిటీకి చెందిన 10, 11 వార్డుల వైసీపీ నాయకులు, కార్యకర్తలు కుటుంబాలతో కలిసి తెలుగుదేశం పార్టీ వైపు అడుగులు వేశారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఈ నిర్ణయం తీసుకున్నట్టు వారు తెలిపారు. సుమారు 100 కుటుంబాలకు చెందిన వారికి టీడీపీ గుంతకల్ మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, ఫోకస్ బూత్ అబ్జర్వర్ రేష్మ పర్వీన్ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి అభినందనలు తెలిపారు.



# మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్‌పై టీడీపీ నేత హనుమప్ప ధ్వజం



పుట్టపర్తి (చైతన్యరథం): మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ చేసిన ఘాటు మాటలు వెంటనే వెనక్కి తీసుకోవాలని సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమప్ప మాజీ మంత్రిని హెచ్చరించారు. హనుమప్ప మాట్లాడుతూ సవిత నాయకత్వంలో పెనుకొండ అభివృద్ధి పరుగు పెడుతోందని అది చూసి ఓర్వలేక మంత్రి సవితను వ్యక్తి గతంగా విమర్శలు గుప్పించడం తగదని మండిపడ్డారు, తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లు పెనుకొండ అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎనలేని సహాయం చేశారని గుర్తు చేశారు. గొల్లపల్లి రిజర్వాయిర్ ద్వారా నీటిని తెచ్చి, కియా పరిశ్రమ ద్వారా ఎన్నో వేళ ఉద్యోగాలు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీ కె చెందుతుంది అని తెలిపారు. మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అంతులేని అవినీతి, అక్రమాలను చేసి అక్కడి కళ్యాణదుర్గం ప్రజానీకం ఎక్కడ ఓడిస్తారో అని ఇక్కడికి వచ్చారన్నారు. ఇలాంటి వలస పక్షులను డిపాజిట్లు కూడా రాకుండా తరిమి కోట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయ్ అని తెలిపారు. అనంతరం పరిగి పోలీస్ స్టేషన్ లో ఉషశ్రీ చరణ్ పై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో దొడ్డయ్య, ఫైవ్ కమిటీ సభ్యులు బాలాజీ, వెంకటేష్ లైవ్ స్టాక్, తెలుగు యువత ప్రవీణ్ రెడ్డి తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు, సవిత అభిమానులు పాల్గొన్నారు.

# తోపుదుర్తీ నోరు అదుపులో పెట్టుకో



రాప్తాడు (చైతన్యరథం): మనిషి అన్నాక కాస్తైనా ఇంగితజ్ఞానం ఉంటుందని.. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి కనీసం ఆ ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నాడని... రాప్తాడు నియోజకవర్గ టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హనీ ట్రాప్ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యల మీద వారు తీవ్రంగా స్పందించారు. అనంతపురంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంప్ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ హనీ ట్రాప్ వ్యవహారంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ.. ఇందులో ఎవరున్నా చర్యలు తీసుకుంటున్నారన్నారు. దీనిని ప్రభుత్వం కూడా సీరియస్ గా పరిగణించిందన్నారు. అందుకే పోలీస్ అధికారులతో సహా ఎవరున్నా చర్యలకు వెనుకాడటం లేదన్నారు. ఇలాంటి సమయంలో పోలీస్ చర్యలను హర్షించాల్సిందిపోయి.. సూత్రధారులను వదిలేశారంటూ నిందలు వేస్తున్నారన్నారు. ఎక్కడ ఏది జరిగినా దానిని పరిటాల కుటుంబానికి వారి అనుచరులకు ముడి పెట్టడం ప్రకాష్ రెడ్డికి పరిపాటిగా మారిందన్నారు. హనీ ట్రాప్ వ్యవహారంలో అత్యంత కీలకంగా వ్యవహరించి లక్షలకు లక్షలు డబ్బులు వసూళ్లు చేసిన రుద్రంపేట మాజీ ఉప సర్పంచ్ నరేంద్రరెడ్డి మీ పార్టీ వాడు కాదా అని నిలదీశారు. నీకు, నీ అన్నలకు అతనితో ఉన్న సంబంధాలు నిజం కాదా అని ప్రశ్నించారు. నరేంద్రరెడ్డి తల్లి లక్ష్మీనారాయణమ్మను గొందిరెడ్డిపల్లి నుంచి సింగిల్ విండో డైరెక్టర్ గా ఎన్నుకొని బుక్కచెర్ల సింగిల్ విండో అధ్యక్షురాలిగా చేసిన మాట వాస్తవం కాదా. ఆమె స్థాయిని ఉపయోగించుకుని ఆ సింగిల్ విండో సొసైటీలో అనేక అవక తవకలకు పాల్పడి సొసైటీని రద్దు చేసేలా చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. అనంతపురంలోని వైసీపీ నాయకులకు కూడా నరేంద్ర రెడ్డితో ఉన్న సంబంధాలను కాదనగలారా అని నిలదీశారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే.. హనీ ట్రాప్ లో తోపుదుర్తి సోదరులతో పాటు అనేక మంది వైసీపీ నాయకుల పాత్ర ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని.. ఆ దిశగా పోలీసులు కూడా విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రకాష్ రెడ్డి ఇలాగే నీచంగా మాట్లాడితే ఆయన కుటుంబ వ్యవహారాలు కూడా బయట పెట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. గతంలో మీ ఇంట్లో జరిగిన వ్యవహారాలు కానీ, నీ వ్యక్తిగత వ్యవహారాలు కానీ మేము మాట్లాడితే తల ఎక్కడ పెట్టుకుంటావో చూసుకోవాలన్నారు. ఇకనైనా సభ్యత, సంస్కారంతో నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు.

## కోమటి జయరాంకు ఆత్మీయ స్వాగతం







**శాన్‌ఫ్రాన్సిస్కో:** ఉత్తర అమెరికాలో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా శాన్‌ఫ్రాన్సిస్కో వచ్చిన జయరాం కోమటికి ఎన్నారై టీడీపీ అభిమానులు, పలువురు తెలుగు ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. జయరాంకి వెంకట్ కోగంటి, వీరు ఉప్పల, విజయ ఆసూరి, శ్రీనివాస్ తడపనేని, ప్రసాద్ మంగిన, విజయ్ గుమ్మడి, బిర్యానీ జంక్షన్ వెంకట్, కరుణ్ వెలిగేటి, కళ్యాణ్ కట్టమూరి, రాజశేఖర్ పర్వతనేని, శ్రీని వల్లూరిపల్లి, వెంకట్ మద్దిపాటి, రాధిక, జగదీష్ గింజుపల్లి, భాస్కర్ అన్నే, విజయ్‌రెడ్డి జెట్టి, శ్రీనివాస్ వట్టికూటి, మోహన్ మల్లెంపాటి, భరత్ ముప్పిరాల, రమేష్ మల్లరపు, రామ్ తోట, నరేందర్ రెడ్డి యెన్నంరెడ్డి, రాంబాబు మానుకొండ, బాటా శివ, కిశోరె తాడికొండ, హరి సన్నిధి, తిరుపతిరావు వలివేటి, శివ అద్దంకి, యశస్వి మాధవ, సందీప్ ఇంటూరి, వంశి కందుల, రవికిరణ్ యేలేటి, మహేంద్ర కూచిపూడి అభినందనలు తెలిపారు.







## ఆస్టిన్‌లో వైభవంగా 'తానా' పాఠశాల వార్షికోత్సవం

### బాల రామాయణంతో అలరించిన విద్యార్థులు

**ఆస్టిన్:** ఆస్టిన్ పాఠశాల ఆరవ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. 'తానా' పాఠశాల విద్యార్థులు బాల రామాయణం నాటకం ప్రదర్శించారు. పిల్లల ప్రత్యక్ష తెలుగు భాషా సంభాషణతో రామాయణ పాత్రలను చేయడం మరో ప్రత్యేకత. పాఠశాల పిల్లలు చేసిన అద్భుతమైన నటనకు అందరూ మంత్రముగ్ధులయ్యారు. గౌరవ అతిథిగా విచ్చేసిన సిటీ మేయర్ జిమ్ పిల్లలను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా విశ్వ గురుకులం అంకురం పాఠ్యపుస్తకాన్ని వ్యవస్థాపక సభ్యుడు రామ్ మారం విడుదల చేశారు. పాఠశాల, విశ్వ గురుకులం విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులైన నిహారిక భమిడిపాటి, రితిక గంగబత్తిన వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. పూర్వ విద్యార్థులైన ద్విజేష్ గొంట్ల, సమయ సిద్ధాంత పొట్లచెరువు ఈ సంవత్సరం విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల కో-చైర్ రజని మారం, ఉపాధ్యాయులు అనూష చిట్టూరి, ప్రతూష అట్లూరి, శ్వేత వెలగలేటి, రాజేష్ గంగబత్తిన, శ్రీదేవి కోట, మృదుల కొనంకి, వాసవి కల్వ, విశ్వ గురుకులం ఉపాధ్యాయుడు వంశీ భరద్వాజ్‌ని ' తానా' చైర్మన్ నాగేంద్ర శ్రీనివాస్, 'తానా' ప్రెసిడెంట్ నరేన్ కొడాలి అభినందించారు. శ్రీనివాస్ లావు, శ్రీనివాస్ ఒరుగంటి, రాజా కసుకుర్తి, ఠాగూర్ మల్లినేనిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.









## అట్లాంటాలో వాసవీ జయంతి

### భక్తిశ్రద్ధలతో కొలిచిన ప్రవాస భారతీయులు



**కమ్మింగ్:** అమెరికాలోని జార్జియా రాష్ట్రం కమ్మింగ్ నగరంలో వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో వాసవి జయంతిని వైభవంగా నిర్వహించారు. శివ దుర్గ ఆలయంలో జరిగిన వేడుకలో ప్రవాస వాసవీయులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారి పట్ల భక్తిని చాటుకున్నారు. ధర్మం, శాంతి, కరుణకు ప్రతిరూపమైన వాసవీ మాత జన్మదిన వేళ ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో పులకించిపోయింది. గణేశ పూజ, కలశ స్థాపనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం వాసవీ మాత మూల మంత్ర హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఏడాది వేడుకల్లో నవ హారతులు, ఉయ్యాల సేవ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు పారాయణం, హారతులు వంటి కార్యక్రమాల్లో పాల్గొని అమ్మ కృపకు పాత్రులయ్యారు. కార్యక్రమం విజయవంతం కోసం స్వచ్ఛంద సేవకులు, కో-ఆర్డినేటర్లు, బోర్డ్ ఆఫ్ ట్రస్టీ సభ్యులు... ముఖ్యంగా మహిళా వాలంటీర్లు నిస్వార్థంగా శ్రమించారు. వాసవి సేవా సంఘం ధర్మ మార్గంలో నడుస్తూ సమాజ శ్రేయస్సు కోసం, రాబోయే తరాలకు మన సంస్కృతిని అందించేలా కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది. దాతలకు, స్పాన్సర్లకు సహకరించిన వారందరికీ వాసవీ సేవా సంఘం కృతజ్ఞతలు తెలియజేసింది.



## ఓక్లహోమాలో తెలుగు వైభవం

### సంప్రదాయబద్ధంగా ఉగాది సంబరాలు




**ఓక్లహోమా:** అమెరికాలోని ఓక్లహోమా తెలుగు సంఘం ఆధ్వర్యంలో 'ఉగాది సంబరాలు 2026' అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా జరిగాయి. తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలకు తెలుగు సమాజం నుంచి విశేష స్పందన లభించింది. ఓక్లహోమా సిటీలోని హిందూ టెంపుల్‌ను ఉగాది శోభ ఉట్టిపడేలా ముస్తాబు చేశారు.

ఈ ఏడాది ఉగాది వేడుకల్లో ఒక సరికొత్త రికార్డు నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా 105 మందికి పైగా కళాకారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాలుపంచుకోవడంతో సభా ప్రాంగణం హోరెత్తిపోయింది. ఈ భారీ కార్యక్రమం విజయవంతానికి OTS ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు నీహారిక అందవరపు, సుధ, కళ్యాణ్, శ్రీధర్, ప్రవీణ్, కిషోర్, సురేష్, నర్సి విశేష కృషి చేశారు. సాయి కిరణ్‌కుమార్, సుధా మెట్టుపల్లి, సింధు, త్రిష వ్యాఖ్యాతలుగా వ్యవహరించి కార్యక్రమాన్ని రక్తికట్టించారు. నీహారిక అందవరపు, నిహారిక, సౌమ్య, హేమల కొరియోగ్రఫీలో ప్రదర్శించిన నృత్య రూపకాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. భార్గవ్, హారిక, యమున, భార్గవి, శిరీష, రోహిణి వాలంటీర్లుగా సేవలందించి కార్యక్రమం సజావుగా సాగేలా చూశారు. ఈ వేడుక విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా భారీ సంఖ్యలో తరలివచ్చిన తెలుగు కుటుంబాలకు OTS కమిటీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమం ఓక్లహోమాలో తెలుగు వారి ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.





# వచ్చే నెలలో ప్రధాని నరేంద్ర మోదీ యూరప్ పర్యటన



ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే నెలలో యూరప్ పర్యటనకు వెళ్లనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నాలుగు ఐరోపా దేశాల పర్యటన సమయంలో మార్గమధ్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఆగి.. ఆ దేశాధ్యక్షుడితో చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు సమాచారం. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ ఇంధన సరఫరా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ సమయంలో ప్రధాని యూఏఈ అధ్యక్షుడితో సమావేశమవ్వనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇంధన సరఫరాతో పాటు ప్రాంతీయ భద్రత, పెట్టుబడులు, ఆహార ఉత్పత్తుల రవాణా కారిడార్లు, డిజిటల్ చెల్లింపుల సహకారం, ఇరుదేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వంటి అంశాలపైనా చర్చలు జరిగే అవకాశం ఉంది. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారత్‌ను సందర్శించిన కొన్ని నెలలకే మోదీ ఆ దేశానికి వెళుతుండడం గమనార్హం. ఇంధన కొరత ఆందోళనల వేళ కేంద్రమంత్రులు అజిత్ దోవల్, జైశంకర్, హర్దీప్ సింగ్ పురీ వారం రోజుల క్రితం యూఏఈలో పర్యటించారు. చమురు ఎగుమతి దేశాల సమాఖ్య అయిన ఒపెక్, దాని విస్తృత గ్రూప్ ఒపెక్‌ నుంచి వైదొలుగుతున్నట్లు తాజాగా యూఏఈ ప్రకటించిన విషయం తెలిసిందే.

# రెండో విడతలో టీఎంసీ చేతివాటం

## బెంగాల్ ఎస్ఈసీకి బీజేపీ ఫిర్యాదు



పశ్చిమబెంగాల్‌లో బుధవారం రెండోవిడత పోలింగ్ జోరుగా సాగింది. ఈ నేపథ్యంలో డైమండ్ హార్బర్లోని ఓ నియోజకవర్గంలోని పలు పోలింగ్ బూత్‌లలో 'కమలం గుర్తు' కనిపించకుండా చేసి. ఓటేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారని భాజపా ఆరోపించింది. ఓటింగ్ యంత్రంలో కమలం గుర్తు దగ్గర ఉన్న బటన్ ను వినియోగించకుండా దానిని టేప్తో కప్పి ఉంచినట్లు భాజపా పశ్చిమబెంగాల్ కో ఇన్చార్జి అమిత్ మాలవీయ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పలు వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోకుండా చేయడానికి తృణమూల్ నేతలు స్థానిక అధికారుల సహాయంతో ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని అమిత్ మాలవీయ ఆరోపించారు. ఈ ఘటనలు జరిగిన అన్ని బూత్‌లలో తక్షణమే రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో డైమండ్ హార్బర్ స్థానం నుంచి మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ లోక్‌సభ ఎన్నికల్లో గెలవడానికి కూడా టీఎంసీ ఇదే వ్యూహాన్ని అవలంభించిందని అన్నారు. ఇతర పోలింగ్ బూత్లలోని పరిస్థితులను తమ పార్టీ పర్యవేక్షిస్తోందన్నారు. పోలింగ్ బూత్లలో బటన్ల ట్యాంపరింగ్పై వచ్చిన నివేదికలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని పశ్చిమ బెంగాల్ ఎన్నికల కమిషనర్ వెల్లడించారు. అవి నిజమని తేలితే.. ప్రభావిత బూత్‌లలో తిరిగి పోలింగ్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలింగ్ బూత్లలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు వెల్లడించారు.

# పోలీసుల తప్పిదం.. నిందితురాలికి ఆయాచిత వరం!

## మేఘాలయ హనీమూన్ హత్య కేసులో సోనమ్‌కు బెయిల్



సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో నిందితురాలు సోనమ్ రఘువంశీకి బెయిల్ లభించింది. అయితే, సోనమ్ అరెస్టు సమయంలో పోలీసులు చేసిన తప్పిదం వల్లే ఆమెకు బెయిల్ మంజూరైనట్లు తాజాగా బయటకొచ్చింది. దీనిపై బాధిత రఘువంశీ కుటుంబం మేఘాలయ హైకోర్టును ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతుంది. భారతీయ న్యాయ సంహిత ప్రకారం.. హత్యకు సంబంధించి నిందితులపై 103(1) సెక్షన్ విధించాలి. కానీ ఈ హనీమూన్ హత్య కేసుకు సంబంధించి సోనమ్ అరెస్టు మెమోలో సెక్షన్ 403(1) అని ప్రస్తావించారు. బీఎన్ఎస్ఈ ఇలాంటి సెక్షనే లేదు. సాంకేతిక తప్పిదం వల్ల ఇలా జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. అయితే, అరెస్టు మెమోలోనే కాకుండా.. కేసుకు సంబంధించిన అన్ని పత్రాల్లోనూ ఇదే సెక్షన్ ప్రస్తావించడాన్ని మేఘాలయ కోర్టు గుర్తించింది. సాంకేతిక తప్పిదమనే పోలీసుల వాదనలను తిరస్కరించింది. ఈ క్రమంలో సోనమ్ అరెస్టుకి సరైన కారణాలు లేవని పేర్కొంది. దీంతోపాటు సోనమ్ను అరెస్టు చేసి తొలిసారి గాజీపుర్లోని కోర్టులో హాజరుపరిచినప్పుడు.. న్యాయవాదిని కలిసేందుకు ఆమెకు అనుమతులు ఇచ్చినట్లు రికార్డుల్లో ఎక్కడా లేదని కోర్టు పేర్కొంది. దీని కారణంగా ఆమె మొదట్లోనే తన అరెస్టును సవాల్ చేయలేకపోయిందని గుర్తించింది. ఈ లోపాల వల్ల సోనమ్‌కు బెయిల్ మంజూరుచేస్తున్నట్లు న్యాయస్థానం తీర్పునిచ్చింది. అయితే, అనుమతులు లేకుండా సోనమ్ షిల్లాంగ్ జిల్లాను విడిచివెళ్లకూడదన్న షరతు విధించింది. సోనమ్కు బెయిల్ రావడంపై రాజా రఘువంశీ కుటుంబం ఆశ్చర్యపోయింది. దీనిపై మేఘాలయ హైకోర్టును ఆశ్రయించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దీంతోపాటు సోనమ్ను అరెస్టు చేసి తొలిసారి గాజీపుర్లోని కోర్టులో హాజరుపరిచినప్పుడు.. న్యాయవాదిని కలిసేందుకు ఆమెకు అనుమతులు ఇచ్చినట్లు రికార్డుల్లో ఎక్కడా లేదని కోర్టు పేర్కొంది. దీని కారణంగా ఆమె మొదట్లోనే తన అరెస్టును సవాల్ చేయలేకపోయిందని గుర్తించింది. ఈ లోపాల వల్ల సోనవమ్ బెయిల్ మంజూరుచేస్తున్నట్లు న్యాయస్థానం తీర్పునిచ్చింది. అయితే, అనుమతులు లేకుండా సోనమ్ షిల్లాంగ్ జిల్లాను విడిచివెళ్లకూడదన్న షరతు విధించింది. సోనము బెయిల్ రావడంపై రాజా రఘువంశీ కుటుంబం ఆశ్చర్యపోయింది. దీనిపై మేఘాలయ హైకోర్టును ఆశ్రయించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్కు చెందిన రాజా రఘువంశీ కుటుంబం ట్రాన్స్పోర్ట్ వ్యాపారం చేస్తోంది. గతేడాది మే 11న అతడికి సోనమ్‌తో వివాహం జరగ్గా.. 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయకు వెళ్లారు. ఆ తర్వాత వీరు కన్పించకుండాపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలోనే అదృశ్యమైన 11 రోజుల తర్వాత: రాజా రఘువంశీ మృతదేహాన్ని సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలో లోతైన లోయలో పోలీసులు గుర్తించారు. అతడి శరీరంపై కత్తి గాయాలు ఉండటంతో పోలీసులు హత్యగా అనుమానించారు. అనంతరం సోనమ్ కోసం గాలించగా.. ఉన్నట్టుండి జూన్ 7న ఆమె ఉత్తరప్రదేశ్‌లోని గాజీపుర్లో ప్రత్యక్షమైంది. ప్రియుడితో కలిసి ఆమె భర్తను హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. ఆమెకు సహకరించిన ప్రియుడు రాజ్ కుశ్వాహాతో సహ మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, వీరిలో ముగ్గురికి ఇప్పటికే బెయిల్ లభించింది.



# ఉన్న చట్టాలు చాలు

## విద్వేష ప్రసంగాల సమస్యపై సుప్రీం వెల్లడి

విద్వేష ప్రసంగాల సమస్యను పరిష్కరించేందుకు ప్రస్తుతం ఉన్న చట్టాలు సరిపోతాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. తాను జోక్యం చేసుకోవాల్సినంత శాఖాపరమైన శూన్యత ఏమీ లేదని పేర్కొంది. ఇలాంటి కేసుల్లో శిక్షను నిర్ణయించడం అనేది పూర్తిగా చట్టసభ పరిధిలోనే ఉంటుందని గుర్తుచేసింది. కోర్టులు చట్టాలను వివరించగలవు గానీ.. వాటిని రూపొందించలేవని వెల్లడించింది. అయితే మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా కొత్త చట్టాలు అవసరమా.. లేదా..? అన్న అంశాలను పరిశీలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మాత్రమే సౌలభ్యత ఉంటుందని పేర్కొంది. విద్వేష ప్రసంగాల విషయంలో పిటిషనర్లు కోరినట్లు ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది.

# గాజియాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం

ఉత్తర్ ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఒక ప్రైవేట్ హౌసింగ్ సొసైటీలోని ఓ ఫ్లాట్లో మంటలు చెలరేగాయి. ఇది మరికొన్ని ఫ్లాట్లకు కూడా విస్తరించడంతో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. ఇందిరాపురంలోని గౌర్ గ్రీన్ అవెన్యూ హౌసింగ్ సొసైటీలో ఈ ఘటన చోటుచేసుకొంది. తొలుత ఒక ఫ్లాట్‌లో మంటలు చెలరేగగా.. తర్వాత మిగిలిన ఫ్లాట్లకు కూడా అవి వ్యాపించాయి. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన నివాసితులు.. బయటకు పరుగులు తీశారు. ఈ సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మూడు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా, లేదా అనే దానిపై ఎలాంటి సమాచారం లేదు. ప్రమాదానికి గల కారణాలు కూడా ఇంకా తెలియరాలేదు. ఈ ప్రమాదంలో 10-12 ఫ్లాట్లు కాలిపోయాయని స్థానిక నివాసి రోహిత్ మీడియాతో పేర్కొన్నారు.

# మూడో వారంలో సీబీఎస్ఈ ట్వెల్త్ ఫలితాలు

## ఆలస్యమవుతుందనే ప్రచారానికి బోర్డు వర్గాల ఖండన

సీబీఎస్ఈ 12వ తరగతి సమాధాన పత్రాలను ఈ ఏడాది తొలిసారిగా డిజిటల్ మూల్యాంకనం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఇందులో సాంకేతికలోపం తలెత్తడంతో మూల్యాంకన ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని బోర్డు ఖండించింది. తాము ప్రవేశపెట్టిన ఆన్ స్క్రీన్ మార్కింగ్ విధానంలో మూల్యాంకన ప్రక్రియ సజావుగా జరుగుతోందని స్పష్టం చేసింది. ఈ అంశంపై సీబీఎస్ఈ పరీక్షల కంట్రోలర్ సన్యం భరద్వాజ్ పీటీఐతో మాట్లాడారు. మే మూడో వారం నాటికి ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన విధానంలో సాంకేతిక లోపాలను ఎత్తిచూపుతూ వచ్చిన మీడియా కథనం వాస్తవదూరంగా ఉందన్నారు. ఎవాల్యుయేషన్ ప్రక్రియ గతంలో కన్నా అద్భుతంగా జరుగుతోందని తెలిపారు. ఈ విధానంపై టీచర్లు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, తమకు సెల్ఫీలు, ఫొటోగ్రాఫ్‌లు, మెసేజ్‌లు పంపుతూ కృతజ్ఞతలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. ఎవాల్యుయేషన్ షెడ్యూల్ ప్రకారమే జరుగుతోందని, ఫలితాలను మే మూడో వారం నాటికి విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచి బోర్డు కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. 12వ తరగతి సమాధాన పత్రాలను సంప్రదాయ పద్ధతిలో కాకుండా తొలిసారిగా ఆన్, స్క్రీన్ మార్కింగ్ విధానంలో డిజిటల్గా మూల్యాంకనం చేస్తున్నారు. ఈ విధానం వల్ల ఫలితాల ప్రక్రియ వేగవంతం కావడమే కాకుండా పారదర్శకత పెరుగుతుందని బోర్డు వర్గాలు పేర్కొంటున్నాయి.



# పాక్-సౌదీ స్నేహం కారణమా?

### ఒపెక్ నుంచి యూఏఈ నిష్క్రమణ అంశం



యూఏఈ: ఆర్గనైజేషన్ ఆఫ్ ది పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్ (ఒపెక్) నుంచి వైదొలగాలని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. దాదాపు 60 సంవత్సరాల పాటు ఒపెక్‌లో సభ్య దేశంగా ఉన్న యూఏఈ ఇప్పుడు ఎందుకు బయటకు వచ్చింది? అనే అంశం చర్చకు వస్తోంది. దీని వెనుక పలు కారణాలు ఉన్నాయట. ఒపెక్‌ను నడిపిస్తున్న సౌదీ అరేబి యాకు పాకిస్థాన్‌తో ఉన్న స్నేహం కూడా యూఏఈ ఆగ్రహానికి ఓ కారణమని వార్తలు వస్తున్నాయి. నిజానికి కొంతకాలంగా యూఈ ఏ, సౌదీ మధ్య చమురు ఉత్పత్తి విషయంలో విభేదాలు ఉన్నాయి. ముడి చమురు ఉత్పత్తి విషయం లో సౌదీ అరేబియా విధిస్తున్న పరిమితులు యూఏఈ అసంతృప్తికి కారణం. చమురును ఎక్కువగా వెలికి తీయాలని యూఏఈ భావి స్తోంది. డిమాండ్‌కు తగినట్టుగా ఒపెక్ దేశాలన్నీ పరిమితంగానే చమురును ఉత్పత్తి చేయాలని సౌదీ కోరుతోంది. ఒపెక్ విధించిన కోటా కారణంగా తమ ఉత్పత్తిని పెంచుకోలేకపోతున్నామని యూఏఈ అసహనంగా ఉంది. మరోవైపు పాకిస్థాన్‌తో సౌదీ స్నేహం బంధం కూడా యూఏఈకి చిరాకు కలిగిస్తోంది. అమెరికా-ఇరాన్ దేశాలకు మధ్యవర్తిగా ఉన్న పాకిస్థాన్ తీరుపై యూఏఈ ఆగ్రహంగా ఉంది. యుద్ధ సమయంలో గల్ఫ్ దేశాలపై జరిగిన దాడులకు ఇరాన్‌ను జవాబుదారీగా నిలబెట్టడంలో పాక్ విఫలమైందని యూఏఈ భావిస్తోంది. పాకిస్థాన్ తటస్థ వైఖరితో ఉందని, బాధిత దేశాల వైపు నిలవలేదని యూఏఈ విమర్శలు చేస్తోంది. గల్ఫ్ దేశాలన్నింటిలోకి యూఏఈనే ఇరాన్ తీవ్ర శత్రువుగా భావిస్తోంది. యూఏఈపైనే ఎక్కువగా దాడులు చేసింది. దీంతో ఇరాన్‌పై తీవ్ర సైనిక చర్యకు దిగాలని సౌదీని యూఏఈ ఎప్పట్నుంచో ఒత్తిడి చేస్తోందట. అయితే పాకిస్థాన్ కారణంగానే ఇరాన్‌పై చర్యలకు సౌదీ వెనుకాడుతోందని యూఏఈ భావిస్తోందట. పాకిస్థాన్‌కు గతంలో ఇచ్చిన 3.5 బిలియన్ డాలర్ల అప్పును కూడా యూఏఈ ఇటీవల వసూలు చేసిన సంగతి తెలిసిందే. ఆ డబ్బును సౌదీ నుంచి తీసుకున్న పాక్.. యూఏఈకి చెల్లించింది. మరోవైపు ఒపెక్ నుంచి బయటకు రావడం ద్వారా అమెరికాకు మరింత చేరువ కావొచ్చని యూఏఈ భావిస్తోందట. ఒపెక్ కూటమిని, చమురు ఉత్పత్తిపై పరిమితులను అమెరికా ఎప్పట్నుంచో వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యం లో ఒపెక్ ద్వారా బయటకు వచ్చి చమురు ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి పెంచి అమెరికాతో స్నేహాన్ని మరింత పెంచుకోవాలని యూఏ ఈ ఆశపడుతోందట.

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

### 8 మంది మృతి: కాల్పుల విరమణ ఉల్లంఘన



లెబనాన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. లెబనాన్ దక్షిణ ప్రాంతంలో ఇజ్రాయెల్ నిర్వహించిన వైమానిక దాడుల్లో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ ఇజ్రాయెల్ ఈ దాడులు నిర్వ హించడం పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చింది. ఈ దాడుల్లో మృతుల వివరాలను లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మజ్దల్ జౌన్ పట్టణంపై జరిగిన దాడిలో మొదట ఐదుగురు మరణించగా, తరువాత మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య ఎనిమిదికి చేరింది. ఈ ఘటనలో సివిల్ డిఫెన్స్ సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. ఇద్దరు సైనికులు గాయపడినట్టు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కాగా, హెజ్‌బొల్లా మిలిటెంట్లు ఉపయోగిస్తున్న ఒక పెద్ద టన్నెల్ నెట్‌వర్క్‌ను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఈ టన్నెల్‌ను వ్యూహాత్మక కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. మార్చి ప్రారంభం నుంచి ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఏప్రిల్ 17న ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ ఈ దాడులు ఆగడం లేదు.

# పాక్‌లో వంట గ్యాస్ కష్టాలు

### ప్లాస్టిక్ బెలూన్లలో నిల్వ



పాకిస్తాన్: ఇరాన్ యుద్ధ ప్రభావం పలు దేశాలపై తీవ్రంగా పడింది. దాంతో ఆయా దేశాలు వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరతను ఎదుర్కొంటు న్నాయి. ఇక దాయాది దేశం పాకిస్థాన్‌లో వంటగ్యాస్ సంక్షోభం తీవ్రమైనట్లు తెలుస్తోంది. సరఫరా సరిగా లేక కరాచీవాసులు ప్లాస్టిక్ బెలూన్లలో ప్రమాదకర స్థితిలో పైపుల నుంచి గ్యాస్ నింపుతున్నట్లు మీడియాల్లో కథనాలు వచ్చాయి. కరాచీలో ముఖ్యంగా మోమినాబాద్ ప్రాంత ప్రజలు గ్యాస్ సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటున్నారు. దాంతో వారు ప్రత్యేకంగా తయారుచేసిన బెలూన్ల వైపు మొగ్గు చూపుతున్నారు. కరాచీ మార్కెట్లలో ఇవి రూ.1000 నుంచి రూ.1500కు లభ్య మవుతున్నాయి. గ్యాస్ సరఫరాను తాత్కాలికంగా పునరుద్ధరించ గానే వెంటనే వాటిల్లోకి ఎక్కిస్తున్నారు. గ్యాస్ కొరత వల్ల ఇలా బెలూన్లలో స్టోర్ చేసుకోవడం మినహా తమకు వేరే ప్రత్యామ్నా యం లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. కాగా, గ్యాస్ను ఇలా స్టోర్ చేసుకోవడంపై నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వీటిని 'మొబైల్ బాంబులు'గా వ్యవహరిస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పెనుప్రమాదం జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. చిన్న నిప్పురవ్వ పడినా, రాపిడి, పీడనంలో మార్పు వచ్చి నా అవి పేలిపోవచ్చంటున్నారు. ఇకనైనా గ్యాస్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని అధికారులను కోరుతున్నారు.




# నేను అంత మంచి వాడిని కాదు

### ఫొటో పెట్టి మరీ ట్రంప్ వార్నింగ్

అమెరికా: చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించలేకపోతోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేశారు. అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో వారికి తెలియడం లేదన్నారు. వారు తెలివిగా వ్యవహరిస్తే మంచిదని హితవు పలికారు. 'ఇక మీదట అంత మంచి వాడిగా ఉండను' అని పేర్కొంటూ రైఫిల్ పట్టుకున్న ఫొటోను ట్రంప్ షేర్ చేశారు.

# అమెరికా పాస్‌పోర్ట్‌లపై ట్రంప్ ఫొటో

### ధ్రువీకరించిన విదేశాంగ శాఖ




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. అమెరికా పాస్‌పోర్ట్‌లలో ట్రంప్ ఫోటోను ముద్రించాలని నిర్ణయించడం సంచలనంగా మారింది. అయితే ఈ పాస్‌పోర్ట్‌ల ను పరిమిత సంఖ్యలోనే ముద్రించనున్నారు. అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలకు గుర్తుగా వీటిని జారీ చేయబోతున్నారు. ట్రంప్ ఫోటోతో అమెరికా పాస్‌పోర్ట్‌లను ముద్రించబోతున్నట్టు మొదట మీడియాలో వార్తలు వచ్చాయి. ఆ వార్తలను అమెరికా విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. ఈ పాస్ట్‌పోర్ట్‌లలో ట్రంప్ ఫోటోతో పాటు అమెరికా స్వాతంత్ర్య ప్రకటనకు సంబంధించిన చిత్రాలు, జెండా రూపకల్పన వంటి అంశాలు కూడా ఉంటా యి. కాగా, ఈ పాస్‌పోర్ట్‌లకు ఎలాంటి అదనపు రుసుమునూ వసూలు చేయబోమని విదేశాంగ శాఖ ప్రకటించింది. సాధార ణంగా జీవించి ఉన్న నాయకుల చిత్రాలను అధికారిక పాస్‌పోర్ట్‌లలో ఉపయోగించడం అమెరికాలో అరుదైన విష యం. అందుకే ఈ నిర్ణయం సంప్రదాయాలకు విరుద్ధంగా ఉందని విమర్శలు వస్తున్నాయి. ఇది మాత్రమే కాకుండా.. 250వ స్వాతంత్ర్య వేడుకలకు గుర్తుగా ట్రంప్ సంతకం ఉన్న కరెన్సీ నోట్లను విడుదల చేయబోతున్నట్టు అమెరికా ట్రెజరీ శాఖ ప్రకటించింది. ఆ దేశ కరెన్సీ నోట్లపై సంతకం చేయబోతున్న తొలి అధ్యక్షుడిగా ట్రంప్ చరిత్ర సృష్టించబోతున్నారు. ఈ నిర్ణయాలపై అమెరికాలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా చర్చలు జరుగుతున్నాయి.

# డాలర్లతో గట్టెక్కించండి!



### అమెరికాకు యూఏఈ మొర

యూఏఈ: పశ్చిమాసియా యుద్ధం ప్రభావం గల్ఫ్ సహా పలు దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదిపేస్తోంది. దీంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న చమురు సంపన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఇప్పుడు ఆమెరికా సాయాన్ని కోరు తోంది. ఈ సాయం నగదు. రుణాల రూపంలో కాకుండా.. అమెరికా డాలర్లతో తమ దిర్హమ్లు మార్పిడికి ఒప్పందం చేసుకుందామని అడుగుతోంది. గల్ఫ్‌లోని మరికొన్ని అమెరికా మిత్రదేశాలూ ఇదే బాటలో పయనిస్తున్నాయి. మే 1వ తేదీ నుంచి తాము ఒపెక్ దేశాల కూటమి నుంచి బయటికి వస్తామని యూఏఈ మంగళవారం ప్రకటించింది.

చమురు మార్కెట్లో కల్లోలం కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఒపెక్లో కొనసాగడం కన్నా కూడా దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడం ముఖ్యమని యూఏఈ ఆలోచన చేస్తోంది. దీనివల్ల ఒపెక్ పరిమితుల నుంచి బయటపడొచ్చు... డాలర్లను సమకూర్చుకోవచ్చనేది వ్యూహం. పైపెచ్చు అమెరికా ఆర్థిక, రక్షణ చట్రంలోకి వెళ్లొచ్చని అనుకుంటోంది. గల్ఫ్ దేశాలని చమురు ఆధార ఆర్థిక వ్యవస్థలు. అవి చమురును డాలర్లలో అమ్ముతాయి. డాలర్ మారకం కాబట్టి అమెరికా ఆర్థిక వ్యవస్థకు లబ్ధి చేకూరుతోంది. అయితే యుద్ధం వల్ల చమురు ఎగుమతుల్లేక తమ డాలర్ నిల్వలు గణనీయంగా తగ్గిపోతున్నాయని అమెరికాకు యూఏఈ నివేదించింది. ఇప్పటికి 12,000 కోట్ల డాలర్లు కోల్పోయామని తెలిపింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే తమ వాణిజ్యాన్ని చైనా యువాన్లలోకి మళ్లించడం తప్ప మరో మార్గం లేదని యూఏఈ చెబుతోంది. తమకు ఇష్టంలేకపోయినా యుద్ధాన్ని ప్రారంభించింది అమెరికాయే కాబట్టి.. ఇప్పుడు అదుకోవాల్సింది కూడా ట్రంప్ సర్కారేనని వాదిస్తోంది. దీనికి అమెరికా కూడా సానుకూలత వ్యక్తం చేస్తున్నా.. స్పష్టత మాత్రం ఇవ్వట్లేదు. డాలర్ ఆధిపత్యాన్ని కాపాడుకోవాలి కాబట్టి అంగీకరించే అవకాశాలే ఎక్కువ.

### ఏమిటీ కరెన్సీ మార్పిడి?

ఒక దేశం కరెన్సీని అమెరికా డాలర్ మార్చుకోవడానికి రెండు దేశాల సెంట్రల్ బ్యాంకుల మధ్య కుదిరే ఒప్పందమే కరెన్సీ మార్పిడి ఇది ఒక రకంగా ఆర్థిక భద్రతాఏర్పాటు, ఉదాహరణకు యూఏఈకి అత్యవసరంగా డాలర్లు అవసరమై.. దిర్హమ్లను పంపితే వాటిని అమెరికా ఫెడరల్ రిజర్వ్ తాత్కాలికంగా డాలర్లలోకి మార్చి ఇస్తుంది. ఆ తర్వాత ముందుస్తు అంగీకార రేటు ప్రకారం వాటిని మళ్లీ రివర్స్ చేస్తారు. ఇక్కడ శాశ్వత బదిలీ, లేదా సాయంలాంటివి ఉండవు. ఇలాంటి మార్పిడి వల్ల డాలర్ల కొరతను తీర్చుకోవచ్చని యూఏఈ భావిస్తోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు డాలర్ వెన్నెముకలాంటిది కాబట్టి... అవి తమవద్ద ఉంటే ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుతుందని గల్ఫ్ దేశాలు అనుకుంటున్నాయి.

# ముంబైలో సన్‘రైజర్స్’



- **రికార్డు రన్ ఛేజ్‌తో ముంబైకి షాక్!**
- **సలిల్ అరోరా మెరుపు సిక్సర్‌తో హైదరాబాద్‌దే విజయం**

ముంబై: ఐపీఎల్ 2026లో మరో హై-స్కోరింగ్ థ్రిల్లర్ నమోదైంది. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ నిర్దేశించిన 244 పరుగుల భారీ లక్ష్యాన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయవంతంగా ఛేదించింది. ఆఖర్లో సలిల్ అరోరా కళ్లు చెదిరే సిక్సర్‌తో జట్టుకు 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగుల భారీ స్కోరు సాధించింది. ముంబై ఓపెనర్ రైన్ రికెల్టన్ కేవలం 62 బంతుల్లో 123 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కేవలం 44 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేసి ముంబై ఇండియన్స్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. విల్ జాక్స్ (46)తో కలిసి రికెల్టన్ పవర్‌ప్లేలోనే జట్టు స్కోరును 78 పరుగులకు చేర్చాడు. చివర్లో కెప్టెన్ హార్దిక్ పాండ్యా 15 బంతుల్లో 31 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. 244 పరుగుల అసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన సన్‌రైజర్స్ బ్యాటర్లు పక్కా ప్రణాళికతో ఆడారు. ఆఖరి వరకు ఉత్కంఠగా సాగిన ఈ పోరులో సలిల్ అరోరా తనదైన శైలిలో సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించి అభిమానులను ఖుషీ చేశారు.

భారీ స్కోర్లు నమోదైన ఈ మ్యాచ్‌లో ముంబై బ్యాటర్లు రికార్డులు సృష్టించినా సన్‌రైజర్స్ సమిష్టి పోరాటం ముందు అవి సరిపోలేదు. ఈ విజయంతో ఎస్ఆర్‌హెచ్ పాయింట్ల పట్టికలో తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకుంది.

# ఐపీఎల్ చరిత్రలో వైభవ్ సూర్యవంశీ సరికొత్త చరిత్ర!



ఐపీఎల్ 2026 సీజన్లో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ రికార్డులను తిరగరాస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల వయస్సులోనే ప్రపంచం దృష్టిని ఆకర్షించిన ఈ కుర్రాడు తాజాగా ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత వేగంగా 400 పరుగుల మైలురాయిని చేరుకున్న ఆటగాడిగా నిలిచాడు. ఎదుర్కొన్న బంతుల పరంగా చూస్తే... వైభవ్ కేవలం 167 బంతుల్లోనే ఈ ఘనత సాధించడం విశేషం. గతంలో ఆండ్రీ రసెల్.. 188 బంతులు పేరిట ఉన్న రికార్డును ఈ యువ ఆటగాడు తుడిచిపెట్టేశాడు.

నిన్న పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ మరోసారి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 16 బంతుల్లో 43 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్ ద్వారానే అతను ఈ ఫీట్ సాధించాడు. వైభవ్ బ్యాటింగ్ శైలి ఈ సీజన్‌లో ప్రత్యర్థి బౌలర్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అతను సాధించిన 400 పరుగులలో సుమారు 319 పరుగులు కేవలం పవర్‌ప్లే ఓవర్లలోనే రావడం అతని విధ్వంసానికి నిదర్శనం.

240కి పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేస్తూ ప్రతి మ్యాచ్‌లోనూ జట్టుకు మెరుపు ఆరంభాలను అందిస్తున్నాడు. కేవలం బౌండరీలతోనే కాకుండా మైదానం నలుమూలలా షాట్లు ఆడుతూ ‘నయా సెన్సేషన్’గా మారిపోయాడు. గత సీజన్‌లోనే అతను గుజరాత్ టైటాన్స్‌పై సెంచరీ సాధించి టీ20 క్రికెట్ చరిత్రలో అతి పిన్న వయస్సులో సెంచరీ చేసిన ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై కూడా కేవలం 36 బంతుల్లోనే శతకం బాది అందరినీ ఆశ్చర్యపరిచాడు. అతి తక్కువ ధరకే వేలంలో అమ్ముడైన ఈ బిహార్ కుర్రాడు ఇప్పుడు ఐపీఎల్ విలువైన ఆటగాళ్ల జాబితాలో చేరిపోవడం గమనార్హం.

# ఆ ‘ఇద్దరి’ వల్లే ఈ విజయం

## ఆర్ఆర్ కెప్టెన్ రియాన్ పరాగ్




ఐపీఎల్ 2026లో భాగంగా ముల్లాన్‌పూర్ వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 222 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన రాజస్థాన్ 19.2 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 228 పరుగులు చేసింది. ఇక మ్యాచ్ అనంతరం ఆర్ఆర్ కెప్టెన్ రియాన్ పరాగ్ మాట్లాడుతూ.. శుభమ్ దూబే, డోనోవన్ ఫెర్రీరా అద్భుత బ్యాటింగ్‌తోనే ఈ విజయం సాధించామన్నాడు.

‘శుభమ్ దూబే, ఫెర్రీరా అసాధారణ ప్రదర్శనతో ప్రత్యర్థి నుంచి మ్యాచ్‌ను లాగేశారు. అయితే ఈ టోర్నీ ప్రారంభానికి ముందు ఒక జట్టుగా మేం ఏ విషయాల గురించి చర్చించుకున్నామో.. అవన్నీ ఈ మ్యాచ్‌లో అమలు చేశాం. ప్రత్యర్థిని మరికొన్ని తక్కువ పరుగులకే కట్టడి చేయాల్సింది. మా బౌలర్లు ఎంత శ్రమించిన పంజాబ్ బ్యాటర్లు దూకుడుగా ఆడారు. అయితే మా బౌలర్ల లోటును మా బ్యాటర్లు పూడ్చారు’ అని తెలిపాడు.

‘బౌలింగ్, బ్యాటింగ్‌లో ఇంకొన్ని ఓవర్లు మెరుగ్గా ఆడి ఉండాల్సింది. ఏది ఏమైనప్పటికీ.. 40 ఓవర్ల పాటు అత్యుత్తమ ప్రదర్శన చేయాలనే లక్ష్యంతోనే మేం బరిలోకి దిగుతాం. బయటవారికి మాత్రమే ఆందోళనలు ఉంటాయి. మా ఆటగాళ్లపై మాకు పూర్తి నమ్మకం ఉంది. వికెట్లు కాపాడుకుంటూనే రన్ రేట్ తగ్గకుండా చూసుకోవడమే మా ప్రణాళిక. మధ్యలో కొంచెం వెనుకబడినప్పటికీ.. తిరిగి పుంజుకున్నాం. శుభమ్ దూబే, ఫెర్రీరా బ్యాటింగ్ విధానం నిజంగా ప్రశంసనీయం’ అని రియాన్ పరాగ్ వెల్లడించాడు.

## మహిళల టీ20 ర్యాంకింగ్స్

# ఐదో స్థానంలో స్మృతి మంధాన




*మహిళల టీ20 ర్యాంకింగ్స్ జాబితాను ఐసీసీ ప్రకటించింది. ఇందులో ప్రపంచ స్టార్ మహిళా టీ20 బ్యాటర్ స్మృతి మంధాన మరింత కిందకి వెళ్లింది. ఐసీసీ ప్రకటించిన జాబితాలో ఒక స్థానం కోల్పోయిన స్మృతి.. 747 పాయింట్లతో ఐదో ర్యాంకు సాధించింది. సౌతాఫ్రికా పర్యటనలో ఉన్న టీమిండియా మహిళలు.. ఇటీవల 5 టీ20ల సిరీస్ ఆడిన సంగతి తెలిసిందే. అందులో 4-1 తేడాతో సిరీస్ కోల్పోయారు. భారత ప్లేయర్ల పేలవ ప్రదర్శన ఐసీసీ ర్యాంకింగ్స్‌పై ప్రభావం చూపింది. భారత్‌తో సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ 786 పాయింట్లతో మూడో స్థానానికి ఎగబాకింది. అగ్రస్థానంలో ఆసీస్ స్టార్ ప్లేయర్ జార్జియా వాల్(815) తన స్థానానికి పదిలపర్చుకోగా రెండో స్థానంలో ఆసీస్ బ్యాటర్ బెత్ మూనీ (788) కొనసాగుతోంది. షెఫాలీ వర్మ 729 పాయింట్లతో 9వ స్థానంలో ఉంది. టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ 646 పాయింట్లతో పదో స్థానానికి ఎగబాకింది. ఇక బౌలింగ్ విభాగంలో పాకిస్థాన్ స్టార్ బౌలర్ సాదియా ఇక్బాల్ 743 పాయింట్లతో అగ్రస్థానంలోనే కొనసాగుతోంది. ఆ తర్వాతి స్థానాల్లో ఇంగ్లండ్ ప్లేయర్ సోఫీ ఎకల్‌స్టన్ (727), లారెన్ బెల్ (714) ఉన్నారు. టీమిండియా స్టార్ బౌలర్ దీప్తి శర్మ ఒక ర్యాంక్ మెరుగై 713 పాయింట్లతో నాలుగో స్థానానికి ఎగబాకింది. శ్రీచరణి (681), రేణుకా సింగ్ ఠాకూర్(676) 11, 12వ స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ జాబితాలో టాప్-10 స్థానాల్లో ఎలాంటి మార్పూ లేదు. అగ్రస్థానంలో న్యూజిలాండ్ ప్లేయర్ అమేలియా కెర్(508) ఉంది. హేలీ మ్యాథ్యూస్ (483), దీప్తి శర్మ (357) ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు.*

## విమర్శలే పెట్టుబడిగా..

# షార్ట్ బాల్ బలహీనతను జయించిన శ్రేయస్ అయ్యర్




క్రికెట్ ప్రపంచంలో ఒక ఆటగాడికి తన బలహీనతలే అతిపెద్ద శత్రువులు. టీమిండియా స్టార్ బ్యాటర్, పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు కూడా ‘షార్ట్ బాల్’ ఒక పెద్ద తలనొప్పిగా మారింది. ప్రత్యర్థి బౌలర్లు అయ్యర్ క్రీజులోకి రాగానే బౌన్సర్లతో టార్గెట్ చేయడం... అతను వరుసగా వికెట్ పారేసుకోవడంపై సోషల్ మీడియాతో పాటు క్రికెట్ విశ్లేషకుల నుంచి తీవ్ర విమర్శలొచ్చాయి. అయితే వాటికి కుంగిపోకుండా తనను విమర్శించిన వారే ఆశ్చర్యపోయేలా సమాధానం చెప్పాలని శ్రేయస్ పట్టుదలతో శ్రమించాడు.

తను ఎదుర్కొన్న విమర్శలే తనను మరింత మెరుగుపరుచుకోవడానికి ప్రేరణనిచ్చాయని అయ్యర్ తాజాగా వెల్లడించాడు. నెట్స్‌లో గంటల తరబడి షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కొంటూ తన టెక్నిక్‌ను మార్చుకున్నాడు. ముఖ్యంగా పుల్ షాట్స్ ఆడటంలో ఉన్న లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. “నన్ను విమర్శించే వారు తప్పు అని నిరూపించాలనే కసితో పనిచేశాను, అదే నన్ను ఈరోజు ఒక అత్యుత్తమ ఫినిషర్‌గా మార్చింది” అని అయ్యర్ తన మనసులోని మాటను పంచుకున్నాడు.

ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ ఆట తీరు అద్భుతంగా ఉంది. ఒకప్పుడు తనను భయపెట్టిన బౌన్సర్లను ఇప్పుడు అలవోకగా బౌండరీలకు తరలిస్తూ పంజాబ్ కింగ్స్ జట్టుకు వెన్నెముకలా నిలుస్తున్నాడు. తన బలహీనతను బలపరుచుకుని, లీగ్‌లోనే బెస్ట్ ఫినిషర్లలో ఒకడిగా ఎదిగిన అయ్యర్ ప్రయాణం యువ క్రికెటర్లకు ఒక గొప్ప స్ఫూర్తి. తనను వేలెత్తి చూపిన విమర్శకుల నోళ్లే ఇప్పుడు తనను ప్రశంసించేలా చేసుకున్నాడు.

చైతన్య రథం సినిమా
గురువారం 30 ఏప్రిల్ 2026 X

# 'లెనిన్' ఫస్ట్ రివ్యూ వచ్చేసింది

టాలీవుడ్‌లో అక్కినేని వారసుడు అఖిల్ అక్కినేని నటిస్తున్న తాజా మాస్ ఎంటర్‌టైనర్ 'లెనిన్'పై మళ్లీ చర్చ మొదలైంది. డైరెక్టర్ మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే పలుమార్లు వాయిదాపడిన ఈసినిమా రిలీజ్‌పై ఇటీవల అనేకరూమార్లు చక్కర్లు కొట్టాయి. దీంతో అభిమానుల్లో కొంత అనిశ్చితి నెలకొంది.అయితే ఈ ఊహాగానాలన్నిటికీ తాజాగా స్పష్టత వచ్చినట్టైంది.

ఈ నేపథ్యంలో అక్కినేని నాగార్జున స్వయంగా లెనిన్ ఫస్ట్ కట్‌ను వీక్షించి సినిమాపై తన రివ్యూని షేర్ చేసుకోవడం ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది.అఖిల్ కెరీర్‌లో ఇది పూర్తిగా కొత్త అవతారమని, ప్రేక్షకులు ఇప్పటివరకు చూడని ఎనర్జీ, ప్రెజెన్స్ ఈ సినిమాలో కనిపిస్తాయని నాగార్జున నమ్మకం వ్యక్తం చేశారు. ఆయన రెస్పాన్స్‌తో సినిమా కంటెంట్‌పై






నమ్మకం పెరిగినట్లే కాకుండా, ఫ్యాన్స్‌లో కూడా కొత్త ఉత్సాహం నెలకొంది.

అంతే కాకుండా లెనిన్ రిలీజ్ డేట్ విషయంలో కూడా క్లారిటీ ఇచ్చిన నాగార్జున... ఈ సినిమాను జూన్ 26న గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. దీంతో వాయిదా వార్తలకు చెక్ పడినట్లే అయింది. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను నాగార్జునతో పాటు సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. భారీ అంచనాల మధ్య వస్తున్న లెనిన్ అఖిల్‌కు బాక్సాఫీస్ వద్ద ఎంతటి మైలేజ్ ఇస్తుందో చూడాలి.

## మోడ్రన్ డ్రెస్‌లో...
# అల్ట్రా స్టైలిష్‌గా రుక్మిణి



సప్త సాగరాలు దాటి... సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కన్నడ భామ రుక్మిణి వసంత్ మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఆ సినిమాతో వచ్చిన క్రేజ్, ఫాలోయింగ్‌తో అమ్మడు ప్రస్తుతం పలు పాన్ ఇండియా సినిమాల్లో అవకాశాలు అందుకుని నటిస్తోంది. ఓ వైపు సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ తన అప్డేట్స్‌ను షేర్ చేస్తూ ఫాలోవర్లకు టచ్‌లో ఉంటోంది. అందులో భాగంగా తాజాగా పింక్ కలర్ స్టైలిష్ డ్రెస్‌లో చాలా మోడ్రన్‌గా మెరిసింది. సినిమాల్లో చాలా సింపుల్ గా కనిపించే రుక్మిణి... ఇప్పుడిలాంటి గ్లామరస్ డ్రెస్‌లో కనిపించడంతో నెటిజన్లు ఫిదా అయిపోయి వాటిని నెట్టింట తెగ షేర్ చేస్తూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.

# 'మైసా' కోసం రష్మిక రిస్క్
## 80 అడుగుల ఎత్తు నుంచి జంప్



పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకునే కథానాయికల్లో ముందు వరుసలో ఉంటారు రష్మిక. తాజాగా ఆమె మరోసారి నటనపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. తాను నటిస్తున్న 'మైసా' కోసం మునుపెన్నడూ లేని విధంగా కష్టపడుతున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆమె చేసిన సవాలుతో కూడిన స్టంట్స్ గురించి 'మైసా' డైరెక్టర్ రవీంద్ర పుల్లె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

"రష్మిక పోషిస్తున్న పాత్ర పేరు మైసా చాలా ప్రభావవంతమైన పాత్ర. ఆమె ప్రదర్శించే కోపం, ఆవేశం ఈ సినిమాకు హైలైట్. ఇటీవలే కేరళలోని అతిరపల్లి జలపాతం వద్ద ఒక క్లిష్టమైన యాక్షన్ సీన్ చిత్రీకరించాం. రష్మిక డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్లో పాల్గొన్నారు. ఆమె నిబద్ధత చూసి చిత్ర బృందమంతా ఆశ్చర్యపోయింది" అని తెలిపారు.

ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెవా ఖంపక్డి ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందిందని డైరెక్టర్ వెల్లడించారు. బ్యాంకాక్‌లో వారం పాటు ప్రతిరోజూ 8 గంటల పాటు కఠినమైన యుద్ధ విద్యలను నేర్చుకున్నట్టు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్, గిరిజన పోరాట పద్ధతులను కలిపి ఈ సినిమా కోసం ఓ కొత్త తరహా యాక్షన్ శైలిని డిజైన్ చేసినట్టు ఆయన వివరించారు.

## రిజెక్షన్ అంటే అంతం కాదు...
# ఒక అద్భుతమైన ఆరంభం
### - పూరీ జగన్నాథ్

తిరస్కరణకు గురైనప్పుడల్లా మనలో పట్టుదల పెరగాలంటున్నారు దర్శకుడు పూరి జగన్నాథ్. తాజాగా ఆయన పూరి మ్యూజింగ్స్‌లో ఈ అంశంపై మాట్లాడారు. "తిరస్కరణను స్వీకరించినప్పుడు జీవితం ముందుకు సాగుతుంది. రిజెక్షన్ అనేది సహజం. అది ఒక ఉద్యోగ అవకాశం కావచ్చు. ఒక సంబంధం కావచ్చు. లేదంటే మీరు ఎంతో ఆశించిన కల కావచ్చు. రిజెక్షన్ ఎదురైనప్పుడు గుండె బరువెక్కిపోతుంది. నీరసం వస్తుంది. వాటిని పట్టించుకోకుండా ముందుకు సాగాలి. ఒక కొత్త ప్రారంభంలా భావించాలి. ఎవరో మిమ్మల్ని కాదన్నంత మాత్రాన మీ విలువేమీ తగ్గిపోదు. అంతకంటే మంచి అవకాశం మీకు రావచ్చేమో ఎవరికి తెలుసు"

"తిరస్కరణ ఒక అవకాశం. ఎవరైనా మిమ్మల్ని రిజెక్ట్ చేస్తే దాన్ని ఓ అవకాశంలా భావించండి. లైఫ్‌లో సక్సెస్ అయిన ఎంతోమంది ఒకప్పుడు రిజెక్ట్ అయిన వాళ్లే. మనం ఎన్నిసార్లు రిజెక్ట్ అయితే అంత పట్టుదలతో పనిచేయాలి.ఒక్కోసారి మన నుంచిసాయం పొందినవారు కూడా మనల్ని చులకనగా చూస్తారు. అప్పుడు ఇంకా బాధగా ఉంటుంది. అలాంటి సందర్భంలో మరింత బలంగా ముందుకు వెళ్లాలి. మీరు ఏమైనా తప్పు చేశారేమో చెక్ చేసుకోండి. ఏవైనా లోపాలు ఉంటే సరిదిద్దుకోండి. టాలెంట్. మీ దగ్గర



ఉంటే మిమ్మల్ని ఎవరూ ఆపలేరు. రిజెక్ట్ అయిన ప్రతిసారీ మీరు ఒక్కో మెట్టు ఎక్కేలా మీ టాలెంట్ని పెంచుకోండి. ఒక తలుపు మూసుకుంటే ఇంకో తలుపు తెరుచుకుంటుంది. ఒక్కరు కాదు.. మిమ్మల్ని 100 మంది కాదన్నా కుంగిపోకూడదు. కొంతమంది మనల్ని అవమానించి మరీ రిజెక్ట్ చేస్తారు. అయినా సరే పట్టించుకోవద్దు. మనం అనుకున్న దానికంటే ఇంకా ఎత్తుకు ఎదుగుతామేమో ఎవరు చెప్పగలరు.." అన్నారు పూరి.

# లండన్ వీధుల్లో 'బేబి' జోడీ
## ఆకట్టుకుంటున్న ఆనంద్ దేవరకొండ 'ఎపిక్' టీజర్

'ఎపిక్-ఫస్ట్ సెమిస్టర్'ఇప్పటికే అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ సినిమా నుంచి ఎలాంటి కంటెంట్ రాబోతోందో తెలుసుకోవాలనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరిగింది. ఈ చిత్రం ఒక హృద్యమైనఅనుభూతిని అందిస్తుందని వాగ్దానం చేస్తోంది. ఇప్పటికే విడుదలైన మొదటి పాట 'సంచారమే' అద్భుతమైన స్పందనను సొంతం చేసుకోగా తాజాగా విడుద లైన టీజర్ ప్రేక్షకుల్లో అంచనాలను అమాంతం పెంచేసింది. 'ఎపిక్' టీజర్ అందమైన అనుభూతిని అందిస్తూ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మధ్య కథను కేంద్రీకరిస్తోంది. 'బేబి' సినిమా తర్వాత ఈ జంటకు ఇప్పటికే మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడు ఈ హిట్ పెయిర్ సరికొత్తగా మరోసారి వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమైంది.

90'ర వెబ్‌సిరీస్తో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న దర్శకుడు ఆదిత్య హాసన్ ఈ సినిమాతో వెండి తెరపై అడుగుపెడుతున్నారు.తాజాగా విడుదలైన టీజర్ మొదటి సినిమాతోనే ఆయన ఘన విజయాన్ని ఖాతాలో వేసుకోబోతున్నారనే నమ్మకాన్ని కలిగిస్తోంది.హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్న ఈచిత్రంలోని తొలి గీతం "సంచారమే" ఇప్పటికే అన్ని ప్లాట్ఫార్మ్లో ట్రెండ్ అవుతూ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఇక టీజర్‌లోనూ తనదైన నేపథ్య సంగీతంతో మెప్పించారు హేషమ్ అబ్దుల్ వహాబ్. లండన్ నేపథ్యంతో సాగే ఈ చిత్రం ఒక అందమైన, ఆసక్తికరమైన ప్రేమకథగా కనిపిస్తోంది. ఆధునిక సంబంధాలు, ప్రేమలో మారుతున్న భావోద్వేగాలను ఈ సినిమా చూపించబోతున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రేమకథలో ఆనంద్ దేవరకొండ ఇంట్రోవర్ట్ (అంతర్ముఖుడు) పాత్రలో కనిపిస్తుండగా... వైష్ణవి చైతన్య పూర్తి విరుద్ధంగా ఎక్స్ట్రావర్ట్ (బహిర్ముఖురాలు) పాత్రలో ఆకట్టుకోనున్నారు. విభిన్నమైన మనస్తత్వాలు కలిగిన ఈ ఇద్దరి మధ్య ప్రేమ ఎలా పుట్టింది?వారి ప్రయాణం ఎలా సాగింది? అనేది టీజర్లో ఎంతో హృద్యంగా చూపించారు.

